


రంజాన్ వేళలు

	ఇఫ్తార్(శుక్రవారం)	సెహరీ(శనివారం)
కర్నూలు	6:33 (సాయంత్రం)	5:03 (ఉదయం)
ఎమ్మిగనూరు	6:30 (సాయంత్రం)	5:16 (ఉదయం)
ఆదోని	6:35 (సాయంత్రం)	5:06 (ఉదయం)

రెండో జాబితా విడుదల



- ఎమ్మిగనూరు టీడీపీ టికెట్ బీవీ జయనాగేశ్వరరెడ్డికే..
- మంత్రాలయం అభ్యర్థిగా ఎన్. రాఘవేంద్రరెడ్డి
- బీజేపీ కోటాలోకి ఆదోని
- పెండింగ్‌లో ఆలూరు.. ఆశావహుల్లో టెన్షన్
- మీనాక్షినాయుడు, తిక్కారెడ్డి వర్గాల్లో నిరుత్సాహం
- నేడు కార్యకర్తలు, అభిమానులతో తిక్కారెడ్డి ప్రత్యేక భేటీ

కర్నూలు, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): రాబోయే సార్వత్రిక ఎన్నికల రణక్షేత్రంలో విజయమే లక్ష్యంగా టీడీపీ అధినేత, మాజీ సీఎం చంద్రబాబు గెలుపు గుర్రాలను ఎంపిక చేశారు. గురువారం 34 మంది అభ్యర్థులతో కూడిన జాబితాను టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు విడుదల చేశారు. ఆ జాబితాలో ఉమ్మడి జిల్లాలో ముగ్గురు అభ్యర్థులకు స్థానం దక్కింది. కర్నూలు జిల్లాలో ఎమ్మిగనూరు టీడీపీ అభ్యర్థిగా ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డికి మరోసారి పోటీ చేసేందుకు అవకాశం కల్పించారు. సామాజిక సమీకరణలు, సర్వేల ఆధారంగా వాల్మీకి సామాజిక వర్గానికి చెందిన మాధవరం ఎన్. రాఘవేంద్రరెడ్డిని మంత్రాలయం టీడీపీ అభ్యర్థిగా ప్రకటించారు. ఈయన సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేయడం ఇదే ప్రథమం. జిల్లాలో ఆలూరు నియోజకవర్గానికి అభ్యర్థిని ప్రకటించాల్సి ఉంది. టీడీపీ, బీజేపీ పొత్తుల్లో భాగంగా ఆదోని బీజేపీ ఖాతాలోకి వెళ్లిపోయింది.

బీజేపీ ఖాతాలోకి ఆదోని

టీడీపీ, జనసేన, బీజేపీ పొత్తులో భాగంగా ఆదోని బీజేపీకి కేటాయించారు. టీడీపీలో అత్యంత సీనియర్ నాయకుడు మాజీ ఎమ్మెల్యే కె.మీనాక్షినాయుడుకు టికెట్ దాదాపుగా ఖరారు అయిందని భావించారు. అంతర్గత సర్వేలు మీనాక్షినాయుడికే అనుకూలంగా ఉండడం, అధినేత చంద్రబాబు ఆశీస్సులు కూడా ఆయనకే ఉండడంతో ఆయన పేరు రెండో జాబితాలో ఉందని పార్టీ రాష్ట్ర నాయకులు పేర్కొన్నారు. అయితే.. పొత్తులో భాగంగా ఆదోని తమకే ఇవ్వాలని బీజేపీ గట్టిగా పట్టుబట్టడంతో బుధవారం చివరి క్షణంలో నిర్ణయం మారినట్లు తెలుస్తోంది. దీంతో టికెట్‌పై ఆశలు పెట్టుకున్న కె. మీనాక్షినాయుడు పేరు జాబితా నుంచి తొలగించి మిగిలిన అభ్యర్థులను ప్రకటించినట్లు సమాచారం. ఇక్కడి బలమైన అభ్యర్థిని బరిలో దింపేందుకు బీజేపీ కర్నూలు పార్లమెంట్ ఇన్‌చార్జి విట్టా రమేశ్, జిల్లా అధ్యక్షుడు కునిగిరి నీలకంఠ, ఓబీసీ జాతీయ కార్యదర్శి డాక్టర్ పార్థసారథి పేర్లను ఆ పార్టీ రాష్ట్ర నాయకత్వం పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. అయితే.. విట్టా రమేశ్ అభ్యర్థిత్వం దాదాపుగా ఖారారైందని, అధికారికంగా ప్రకటించాల్సి ఉందని ఆ పార్టీ ముఖ్య నాయకుడు ఒకరు పేర్కొనడం కొసమెరుపు.

ఆలూరు టీడీపీ ఆశావహుల్లో టెన్షన్

రెండో జాబితాలో ఆలూరు అభ్యర్థి పేరు లేకపోవడంతో ఆశావహుల్లో టెన్షన్ కొనసాగుతోంది. టీడీపీ ఇన్‌చార్జి కోట్ల సుజాతమ్మ, మాజీ ఇన్‌చార్జిలు బి. వీరభద్ర గౌడ్, వైకుంఠం మల్లికార్జున, వైకుంఠం జ్యోతితోపాటు ఇటీవలే టీడీపీలో చేరిన మాజీ మంత్రి గుమ్మనూరు జయరాం కూడా ఆశిస్తున్నారు. డోన్ అభ్యర్థిగా కేంద్ర మాజీ మంత్రి కోట్ల సూర్యప్రకాశ్‌రెడ్డిని ఇప్పటికే ప్రకటించడంతో కోట్ల సుజాతమ్మ టికెట్ రేసు నుంచి తప్పుకున్నట్లే అంటున్నారు. వీరభద్రగౌడ్ ఇటీవల అధినేత చంద్రబాబును కలిశారు. టికెట్‌పై తనకు స్పష్టత ఇచ్చారని చెప్పడంతో ఆయన అనుచరులు సంబరాలు జరుపుకున్నారు. రెండో జాబితాలో అభ్యర్థిని ప్రకటించకపోవడంతో టెన్షన్ నెలకొంది.

మీనాక్షినాయుడు, తిక్కారెడ్డి అనుచరుల్లో అసంతృప్తి

ఆదోని బీజేపీకి కేటాయించడం.. రెండో జాబితాలో మంత్రాలయం అభ్యర్థిగా వాల్మీకి రాఘవేంద్రరెడ్డి పేరు ప్రకటించడంతో ఆదోని, మంత్రాలయం టీడీపీ ఇన్‌చార్జిలు కె. మీనాక్షినాయుడు, పి. తిక్కారెడ్డి అనుచరులు, అభిమానుల్లో తీవ్ర అసంతృప్తి నెలకొంది. తమకే టికెట్ వస్తుందని మీనాక్షినాయుడు, పి .తిక్కారెడ్డి ఎంతో ధీమాగా ఉన్నారు. అధినేత చంద్రబాబు చేపట్టిన బాదుడే బాదుడు, యువగళం పేరిట యువనేత నారా లోకేశ్ చేపట్టిన పాదయాత్రలు సూపర్ సక్సెస్ చేయడం వారి ధీమాకు కారణం. అయితే.. పొత్తుల వల్ల మీనాక్షినాయుడు, సామాజిక సమీకరణాలు వల్ల తిక్కారెడ్డి టికెట్ కోల్పోవాల్సి రావడంతో వారి అభిమానులు, పార్టీ కార్యకర్తల్లో తీవ్ర నిరాశ నిస్పృహలు నెలకొన్నాయి. మంత్రాలయం ఇన్‌చార్జి పి. తిక్కారెడ్డి శుక్రవారం తన సహచరులు, అనుచరులతో ప్రత్యేకంగా భేటీ కానున్నట్లు తెలిసింది. వారు ఎలాంటి సూచనలు చేసినా చివరి వరకు టీడీపీ టికెట్ కోసమే ప్రయత్నాలు చేయాలని, అప్పటికి అధిష్టానం బీ-ఫారం ఇవ్వకపోతే స్వతంత్రంగానైనా పోటీ చేయాలనే ఆలోచనతో ఉన్నట్లు సమాచారం.

ఆదోని తెలుగు తమ్ముళ్లలో ఆందోళన

ఆదోని: ఆదోని అసెంబ్లీ సీటు బీజేపీకి కేటాయించడటంతో ఆదోనిలోని తెలుగు తమ్ముళ్లలో కలకలం రేపింది. దీంతో మాజీ ఎమ్మెల్యే మీనాక్షినాయుడు స్వగృహానికి నియోజకవర్గ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో చేరుకున్నారు. నాయకులు, కార్యకర్తలను చూసి మాజీ ఎమ్మెల్యే మీనాక్షినాయుడు కన్నీటి పర్యంతమయ్యారు. వారికి నచ్చచెబుతూ నమ్ముకున్న వారిని పార్టీ మోసం చేయదని భరోసా ఇచ్చారు. కార్యకర్తలు ఆందోళన చేసినందుకు సిద్ధమయ్యారు. మీనాక్షినాయుడుతోపాటు ఉమాపతినాయుడు, మారుతినాయుడు, సిద్ధార్థ నాయుడు, వెంకటచౌదరి కార్యకర్తలను వారించారు. అధిష్టానం ఏ నిర్ణయం తీసుకున్నా అందుకు కట్టుబడి ఉండాలంటూ హితబోధ చేశారు. నాయకులు, కార్యకర్తలు అభీష్టం మేరకు చంద్రబాబును కలిసేందుకు విజయవాడకు బయలుదేరి వెళ్లారు.



మీనాక్షినాయుడు స్వగృహం వద్ద తెలుగుతమ్ముళ్ల

- పేరు : బీవీ జయనాగేశ్వరరెడ్డి
- నియోజకవర్గం : ఎమ్మిగనూరు
- పార్టీ : తెలుగుదేశం
- విద్యార్హత : ఎంబీబీఎస్
- కుటుంబ నేపథ్యం : అమ్మ నాన్నలు దివంగత మాజీ మంత్రి బీవీ మోహన్‌రెడ్డి, నాగమణెమ్మ, భార్య బైరెడ్డి నిత్యాదేవి, కూతురు యుభాషిణి



రాజకీయ నేపథ్యం: బీవీ జయనాగేశ్వరరెడ్డి తండ్రి దివంగత మాజీ మంత్రి బీవీ మోహన్‌రెడ్డి ఎమ్మిగనూరు నియోజకవర్గం నుంచి 1983 ఉప ఎన్నిక నుంచి 2012 ఉప ఎన్నిక వరకు 8 పర్యాయాలు టీడీపీ అభ్యర్థిగా పోటీ చేశారు. ఐదు సార్లు ఎమ్మెల్యేగా విజయం సాధించారు. ఎన్టీఆర్, చంద్రబాబు మంత్రివర్గంలో కీలకమైన కేబినెట్ మంత్రి పదవులు చేపట్టారు. 2012 ఉప ఎన్నికల్లో ఓటమి తరువాత మానసికంగా కుంగిపోయి మరణించారు. బీవీ మోహన్‌రెడ్డి వారసుడిగా బీవీ జయనాగేశ్వరరెడ్డి రాజకీయ అరంగ్రేటం చేశారు. 2014 ఎన్నికల్లో తొలిసారిగా పోటీ చేసి ప్రత్యర్థి వైసీపీ అభ్యర్థి ఎర్రకోట జగన్మోహన్‌రెడ్డి (ఎమ్మెల్యే ఎర్రకోట చెన్నకేశవరెడ్డి తనయుడు)పై విజయం సాధించి అసెంబ్లీలో అడుగు పెట్టారు. 2019లో ఓటమి చెందారు.

- పేరు : ఎన్.రాఘవేంద్రరెడ్డి
- నియోజకవర్గం : మంత్రాలయం
- పార్టీ : తెలుగుదేశం
- విద్యార్హత : ఇంటర్‌మీడియట్
- కుటుంబ నేపథ్యం : అమ్మా నాన్నలు దివంగత మాధవరం రామిరెడ్డి, లక్ష్మమ్మ. రామిరెడ్డి కేడీసీసీబీ మాజీ చైర్మన్. రాఘవేంద్రరెడ్డికి భార్య యశోదమ్మ, పిల్లలు కొడుకు రాకేశ్‌రెడ్డి, కూతురు ప్రియాంక ఉన్నారు. సోదరులు మాజీ సర్పంచ్ రఘునాథ్‌రెడ్డి, రామకృష్ణారెడ్డి.



రాజకీయ నేపథ్యం : దివంగత కేడీసీసీబీ చైర్మన్ మాధవరం ఎన్. రామిరెడ్డి తనయుడు రాఘవేంద్రరెడ్డి. ఉమ్మడి ఎమ్మిగనూరు నియోజకవర్గంలో ఆనాటి ఎమ్మిగనూరు ఎమ్మెల్యే ఎమ్మెల్యే, మాజీ మంత్రి బీవీ మోహన్‌రెడ్డి అత్యంత సన్నిహితుడు రామిరెడ్డి. ఆ సమయంలో మంత్రాలయం ఎంపీపీగా రెండు పర్యాయాలు బాధ్యతలు చేపట్టారు. నియోజకవర్గాల పునర్విభజన తరువాత 2009లో మంత్రాలయం నియోజకవర్గం ఏర్పడింది. నాటి ఎన్నికల్లో రామిరెడ్డి ప్రజారాజ్యం టికెట్‌పై పోటీ చేసి ఓటమి చెందారు. ఆ తరువాత వైసీపీలో చేరారు. కేడీసీసీబీ చైర్మన్ బాధ్యతలు చేపట్టారు. తండ్రి రాజకీయ వారసత్వాన్ని స్వీకరించిన ఎన్.రాఘవేంద్రరెడ్డి ఇటీవలే వైసీపీని వీడి టీడీపీలో చేరారు. వాల్మీకి సామాజికవర్గం కోటాలో టీడీపీ టికెట్ దక్కించుకున్నారు.

ఏపీపీఎస్సీ కుంభకోణంపై

జగన్ రాజీనామా చేయాలి

టీడీపీ అధ్యక్షుడు బీటీ నాయుడు



కర్నూలు(అర్బన్), మార్చి 14: ఏపీపీఎస్సీలో జరిగిన రూ.150 కోట్ల కుంభకోణానికి బాధ్యతగా ఏమాత్రం నైతిక విలువలున్నా సీఎం జగన్‌రెడ్డి వెంటనే రాజీనామా చేయాలని టీడీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బీటీ నాయుడు డిమాండ్ చేశారు. గురువారం జిల్లా టీడీపీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశం ఆయన మాట్లాడుతూ సీఎం జగన్ రెడ్డి గ్రూప్ -1 ఉద్యోగాలను సంతలో పశువులను అమ్మినట్లు అమ్ముకున్నారని, ఇందులో చోటు చేసుకున్న అక్రమాలను హైకోర్టు బట్టబయలు చేసిందని అన్నారు. గ్రూప్-1 మెయిన్స్‌లో ఒక్కో డిప్యూటీ కలెక్టర్ పోస్టుకు రూ.2.50 కోట్లు, ఒక్కో డీఎస్పీ పోస్టుకు రూ.1.50 కోట్లు తీసుకొని 30 డిప్యూటీ కలెక్టర్, 25 డీఎస్పీ పోస్టులు అక్రమంగా భర్తీ చేశారని ఆరోపించారు. ఆ నోటిఫికేషన్ ద్వారా వివిధ హోదాల్లో విధులు నిర్వహిస్తున్న 162 మంది నియామకాలు చెల్లవని, మళ్లీ గ్రూప్ 1 మెయిన్స్ పరీక్ష నిర్వహించి, ఆరు నెలల్లోపు నియామక ప్రక్రియ పూర్తి చేయాలని హైకోర్టు తీర్పు ఇచ్చిందని తెలిపారు. టీడీపీ ప్రభుత్వం 2018లో నోటిఫికేషన్ ఇవ్వగా 2019లో అధికారంలోకి రాగానే జగన్ ప్రభుత్వం 2019లో ప్రిలిమ్స్, 2022లో మెయిన్స్ నిర్వహించి పెద్దఎత్తున అక్రమాలకు పాల్పడిందన్నారు. వైసీపీ ప్రభుత్వం బరితెగింపులకు ఇది నిదర్శనమన్నారు. రాష్ట్రంలో నిరుద్యోగ యువకులతో చెలగాటమాడుతున్న జగన్‌రెడ్డికి రాబోయే ఎన్నికల్లో కచ్చితంగా బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు.

నిధుల మళ్లింపుపై సర్పంచుల ఆగ్రహం



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న సర్పంచులు

- ఏపీలో పంచాయతీ వ్యవస్థ నిర్వీర్యం
- గ్రామాలే దేశానికి పట్టుకొమ్మలు అనే స్ఫూర్తికి తూట్లు
- రోడ్లు, డ్రైనేజీ, తాగునీరు, వీధి దీపాల పనులు శూన్యం
- వైసీపీ ప్రభుత్వాన్ని ఓడించడమే సర్పంచుల లక్ష్యం
- ఏపీ పంచాయతీరాజ్ చాంబర్ రాష్ట్ర నాయకులు రాజేంద్రప్రసాద్, బిర్రు ప్రతాప్ రెడ్డి

కర్నూలు(కలెక్టరేట్), మార్చి 14: గత మూడు సంవత్సరాలుగా వైసీపీ ప్రభుత్వం రాజ్యాంగబద్ధంగా గ్రామ పంచాయతీలకు ఇవ్వాల్సిన నిధులు, స్థానిక ఆదాయ వనరుల ద్వారా వచ్చే సొంత నిధులు, కేంద్ర ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి ఇచ్చిన 14, 15వ ఆర్థిక సంఘం నిధులను దొంగిలించిందని సర్పంచులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం సర్పంచులు తమ 16 డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ చాంబర్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వైవీబీ రాజేంద్రప్రసాద్, బిర్రు ప్రతాప్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం పంచాయతీలకు రావాల్సిన వేల కోట్ల రూపాయలను నిధులను తన అవసరాలకు దారి మళ్లించి మోసం చేసిందని అన్నారు. దీని వల్ల గత మూడు సంవత్సరాలుగా గ్రామాల్లో రోడ్లు, డ్రైనేజీ తాగునీరు, వీధి దీపాలు తదితర అభివృద్ధి పనులు చేయలేక సర్పంచ్‌లు ఉత్సవ విగ్రహాలుగా మిగిలిపోయామని ఆవేదన వ్యక్తం చేశారు. దీని వల్ల రాష్ట్రంలోని 2,918 గ్రామాల్లో 3.50 కోట్ల మంది గ్రామ ప్రజలు తీవ్రంగా నష్టపోయారని అన్నారు. మరలా వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తే రాష్ట్రంలోని గ్రామాలు శిథిలమయ్యే పరిస్థితి వస్తుందని తెలిపారు. దేశంలోని ఆంధ్రప్రదేశ్‌లో పంచాయతీరాజ్ వ్యవస్థ నిర్వీర్యం అయిపోయిందన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు మునిరెడ్డి, చిత్తూరు జిల్లా పంచాయతీరాజ్ చాంబర్ అధ్యక్షుడు ధనుంజయ యాదవ్, సర్పంచుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు లెనిన్, కార్యదర్శి వేణుగోపాల్ రెడ్డి, సహాయ కార్యదర్శి రామచంద్రుడు, జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు పాల్గొన్నారు.

18 నుంచి ఒంటిపూట బడులు

కర్నూలు(ఎడ్యుకేషన్), మార్చి 14: పాఠశాలల విద్యాశాఖ కమిషనర్ ఆదేశాల మేరకు జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాల్లోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలకు ఈ నెల 18 నుంచి ఒంటిపూట బడులు నిర్వహించాలని జిల్లా విద్యాశాఖ అధికారి శామ్యూల్ గురువారం ఆదేశించారు. ఉదయం 7.45 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పాఠశాలలను నిర్వహించాలని ఆదేశించారు. పదో తరగతి పబ్లిక్ పరీక్ష కేంద్రాల్లో పాఠశాలలకు పరీక్ష రోజు సెలవు ప్రకటించి ఇతర సెలవు దినాల్లో పని చేయాలని సూచించారు. ఈ నెల 24, 31, ఏప్రిల్ నెల 7, 13, 14, 21తేదీల్లో తప్పనిసరిగా పని చేయాల్సి ఉంటుందన్నారు. మిగిలిన రోజులకు స్థానిక పరిస్థితులను బట్టి పాఠశాల యాజమాన్యం నిర్ణయించుకుని పని చేయాల్సి ఉంటుందన్నారు. ఎండల తీవ్రతను దృష్టిలో ఉంచుకుని గ్రామ పంచాయతీ, ఆర్‌డబ్ల్యూఎస్ సహకారంతో తాగునీటి వసతిని ప్రతి పాఠశాలలో ఏర్పాటు చేయాలన్నారు. వైద్య ఆరోగ్యశాఖ సహకారంతో ఓఆర్ఎస్ ద్రావణం ప్యాకెట్లు పాఠశాలలో అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. స్థానిక స్వచ్ఛంద సేవా సంస్థల సహకారంతో విద్యార్థులకు మజ్జిగ ఏర్పాట్లు చేసేందుకు కృషి చేయాలన్నారు. పాఠశాల సమయం ముగిశాక విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించాలన్నారు. ఉప విద్యాశాఖాధికారులు, మండల విద్యాధికారులు తమ పరిధిలోని పాఠశాలలను పర్యవేక్షించి విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా ప్రధానోపాధ్యాయులకు తగిన ఏర్పాట్లు చేసుకునేటట్లు చర్యలు తీసుకోవాలని డీఈవో తెలిపారు.

కనిపించాయా జగన్!



పంపిణీకి నోచుకోని టిడ్కో గృహాలు

- నేషనల్ లా యూనివర్సిటీకి జగన్ శంకుస్థాపన
- వేదికకు కుడి వైపు నిరుపయోగంగా టిడ్కో ఇళ్లు
- ఎడమ వైపు శిథిలమైన ఇందిరమ్మ గృహాలు
- ఆ రెండు ఇళ్ల సముదాయం మధ్య పైలాన్ ఆవిష్కరణ
- ఇళ్లు కనిపించకుండా పరదాలు కట్టిన అధికారులు



శంకు స్థాపన అనంతరం ప్రముఖులతో సీఎం జగన్



శిథిలావస్థకు చేరిన ఇందిరమ్మ ఇళ్లు

కర్నూలు, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): జగన్నాథ గట్టుపై అందమైన హైకోర్టు భవనం నిర్మిస్తామని సీఎం జగన్ అన్నారు. 150 ఎకరాల విస్తీర్ణం, రూ.1,011 కోట్ల వ్యయంతో నిర్మించే జాతీయ న్యాయ విశ్వవిద్యాలయం నిర్మాణానికి గురువారం సీఎం జగన్ శంకుస్థాపన చేశారు. అలాగే.. కర్నూలు నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో అమృత్-2-0 కింద రూ.131.84 కోట్లతో 35.6 ఎంఎల్‌డీ మురుగు నీటి శుద్ధి కేంద్రం, రూ.115 కోట్లతో సమగ్ర నీటి సరఫరా పథకాలకు శంకుస్థాపన పైలాన్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టరు జి.సృజన అధ్యక్షతన జరిగిన సమావేశంలో జగన్ మాట్లాడారు. రాష్ట్రంలో రెండవ జాతీయ న్యాయ విశ్వవిద్యాలయం రాయలసీమలో అందులోనూ కర్నూలులో ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. పాలన వికేంద్రీకరణ చేయాలన్నది లక్ష్యం.. శ్రీబాగ్ ఒడంబడిక మేరకే హైకోర్టు ఏర్పాటు చేయబోతున్నామని తెలిపారు. సీఎం మాట్లాడిన సభా వేదికకు కుడి వైపున గత టీడీపీ ప్రభుత్వంలో ఆనాటి సీఎం చంద్రబాబు ప్రతిష్టాత్మకంగా తీసుకొని నిర్మించిన పది వేల ఏపీ టిడ్కో ఇళ్లు ఉన్నాయి. ఈ ఇళ్ల కోసం దాదాపు రూ.550 కోట్లు ఖర్చు చేశారు. వైసీపీ ప్రభుత్వం వచ్చాక బ్లూ రంగులు వేసి వదిలేశారే తప్ప లబ్ధిదారులకు పంపిణీ చేయలేదు. జగన్నాథ గట్టుపై నుంచి చూస్తే అందమైన టౌన్‌షిప్‌లా కనిపిస్తూ నిరుపయోగంగా ఉన్నాయి. ఎడమ పక్కనే వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో కాంగ్రెస్ ప్రభుత్వం కట్టించిన పది వేలకు పైగా ఇందిరమ్మ ఇళ్ల శిథిలాలు దర్శనం ఇస్తున్నాయి. తాగు నీరు, రోడ్లు, విద్యుత్.. వంటి మౌలిక వసతులు లేక శిథిలమయ్యాయి. టిడ్కో ఇళ్లు.. ఇందిరమ్మ గృహాలు కనిపించకుండా పరదాలు కట్టారు. కార్యక్రమం అనంతరం న్యాయవాదులు, లా విద్యార్థులు, స్థానికులు కుడి, ఎడమ వైపుల్లో ఉన్న ఆ ఇళ్లు కనిపించాయా జగన్..! అంటూ సెటైర్లు వేయడం కొసమెరుపు. కార్యక్రమంలో మానవ హక్కుల కమిషన్ చైర్మన్ జస్టిస్ మాంధాత సీతారామమూర్తి, ఏపీ లోకాయుక్త చీఫ్ జస్టిస్ పి. లక్ష్మణ్‌రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ న్యాయ శాఖ కార్యదర్శి జి. సత్య ప్రభాకర్, ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి, కలెక్టరు జి. సృజన, ఎమ్మెల్యేలు కాటసాని రాంభూపాల్‌రెడ్డి, హఫీజ్‌ఖాన్, శ్రీదేవి, ఎర్రకోట చెన్నకేశవరెడ్డి, డాక్టర్ సుధాకర్, మేయర్ బీవై రామయ్య, కేడీసీసీబీ చైర్ పర్సన్ ఎస్వీ విజయమనోహరి, జేసీ నారపురెడ్డి మౌర్య తదితరులు పాల్గొన్నారు.

వైసీపీకి షాక్

- టీడీపీలో చేరిన కర్నూలు ఎంపీ సంజీవకుమార్
- పసుపు కండువా వేసి ఆహ్వానించిన చంద్రబాబు



ఎంపీ డాక్టర్ సంజీవ్‌కుమార్‌ను టీడీపీలోకి ఆహ్వానిస్తున్న చంద్రబాబు

కర్నూలు, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల షెడ్యూలు రాబోతున్న కీలక తరుణంలో వైసీపీకి భారీగా రాజకీయ దెబ్బలు తగులుతున్నాయి. ఇటీవలే జిల్లాకు చెందిన మంత్రి గుమ్మనూరు జయరాం వైసీపీ పార్టీకి, మంత్రి పదవికి రాజీనామా చేసి చంద్రబాబు సమక్షంలో టీడీపీలో చేరారు. ఈ ఘటన నుంచి వైసీపీలో తేరుకోకనే మరో భారీ షాక్ ఇచ్చారు కర్నూలు ఎంపీ డాక్టరు సంజీవ్‌కుమార్ గురువారం మంగళగిరి టీడీపీ జాతీయ కార్యాలయంలో ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు, మాజీ సీఎం చంద్రబాబు సమక్షంలో టీడీపీలో చేరారు. పసుపు కండువా వేసి చంద్రబాబు పార్టీలోకి ఆహ్వానించారు. నగరంలో ప్రముఖ ప్రైవేటు వైద్యశాల ఆయుష్మాన్‌భవ ఆస్పత్రి అధినేత అయిన డాక్టర్ సంజీవ కుమార్ 2019 ఎన్నికలకు ముందు రాజకీయాల్లోకి అడుగు పెట్టారు. బీసీలలో చేనేత సామాజిక వర్గానికి చెందిన ఈయనకు వైసీపీ టికెట్‌పై పోటీ చేసి ఎంపీగా గెలిచారు. రాబోయే ఎన్నికల్లో కూడా కర్నూలు ఎంపీ టికెట్ ఆశించారు. అయితే.. ఆయనకు మాట మాత్రంగానైన చెప్పకుండా సీఎం జగన్ మరో అభ్యర్థికి అవకాశం ఇవ్వడంతో అవమానంగా భావించిన ఆయన జనవరి 10న వైసీపీ సభ్యత్వానికి, ఎంపీ పదవికి రాజీనామా చేశారు. ఆ రోజు నుంచి సైలెంట్‌గా ఉన్న ఆయన గురు వారం తన అనుచరులు, సన్నిహితులతో కలసి మంగళగిరి చేరుకున్నారు. టీడీపీ అధినేత చంద్రబాబును కలిసి టీడీపీలో చేరారు. ప్రస్తుతం కర్నూలు టీడీపీ ఎంపీ టికెట్ ఆశిస్తున్నారు. కర్నూలు, ఎమ్మిగనూరు, ఆదోని, కోడుమూరులో చేనేత వర్గాల్లో డాక్టర్ సంజీవ్‌కుమార్‌కు మంచి పట్టు ఉంది. ఆయన చేరిక చేనేతల్లో టీడీపీకి కలసి వస్తుందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

ఇంటర్ ప్రథమ సంవత్సరం పరీక్షలు పూర్తి

వీడ్కోలు చెప్పుకున్న విద్యార్థులు



పరీక్ష రాసి వెళ్తున్న విద్యార్థినులు

కర్నూలు(ఎడ్యుకేషన్), మార్చి 14: ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం మెయిన్ పరీక్షలు గురువారం పూర్తయ్యాయి. ఈ నెల 1వ తేదీన ఈ పరీక్షలు ప్రారంభమయ్యాయి. అయితే.. మైనర్ మీడియా పరీక్షలు ఈ నెల 20వ తేదీ వరకు కొనసాగుతాయి. ఇంటర్ ద్వితీయ సంవత్సరం మెయిన్ పరీక్షలు శుక్రవారంతో పూర్తి కానున్నాయి. పరీక్ష కేంద్రాల నుంచి బయటికి వచ్చిన విద్యార్థులు ఆనందంతో గంతులేస్తూ కేరింతలు కొట్టారు. బై..బై అంటూ ఒకరికొకరు వీడ్కోలు చెప్పుకున్నారు. పరీక్షలు పూర్తి కావడంతో హాస్టల్‌లో ఉండే విద్యార్థులు తమ సరంజామాను సర్దుకుని సొంతూళ్లకు బయలుదేరి వెళ్లారు.

820 మంది విద్యార్థులు గైర్హాజరు

జిల్లాలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం గురువారం జరిగిన పరీక్షకు 820 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని ఆర్ఐవో ఎస్‌వీఎస్ గురువయ్యశెట్టి తెలిపారు. జిల్లాలో మొదటి సంవత్సరం విద్యార్థులు మొత్తం 23,418 మంది నమోదు చేసుకున్నారని అన్నారు. వీరిలో 820 మంది పరీక్షలకు గైర్హాజరయ్యారని తెలిపారు. మాల్ ప్రాక్టీసు కేసులు నమోదు కాలేదన్నారు.

పదోన్నతిపై డైట్ ప్రిన్సిపాల్ నియామకం

కర్నూలు(ఎడ్యుకేషన్), మార్చి 14: కర్నూలు డైట్ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌గా పని చేస్తున్న సీనియర్ లెక్చరర్ పి.వసుంధరాదేవికి పదోన్నతి కల్పిస్తూ డైట్ ప్రిన్సిపాల్‌గా నియమించారు. ఈ మేరకు పాఠశాల విద్యా శాఖ డిప్యూటీ డైరెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. గురువారం వసుంధర దేవి ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమెకు టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బంది అభినందనలు తెలిపారు.

పేరుసోముల ఉపాధ్యాయుడికి మోదీ ప్రశంస

సంజామల, మార్చి 14: సంజామల వాసి పేరుసోముల జిల్లా పరిషత్ సైన్స్ ఉపాధ్యాయుడు మేడా హరిప్రసాద్‌ను అభినందిస్తూ భారత ప్రధాని నరేంద్ర మోదీ ప్రశంసా పత్రాన్ని గురువారం పంపించారు. ఈ ఏడాది జనవరి 29 న జరిగిన పరీక్షపై చర్చ ఆన్‌లైన్ కార్యక్రమంలో పాల్గొని 10వ తరగతి విద్యార్థులకు పరీక్షల పట్ల గల వివిధ సందేహాలు ప్రస్తావించి వాటిని నివృత్తి చేసి మానసికంగా ఒత్తిడి ఎదుర్కొని పరీక్షలు ఎలా రాయాలి తదితర అంశాలపై చర్చించినందుకు ప్రధానమంత్రి కార్యాలయం నుండి ప్రశంస పత్రం పాఠశాల వె బ్‌సైట్‌కు పంపారు. ఈ పాఠశాలలో హెచ్‌ఎం. సీతరావమ్మ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు హరిప్రసాద్‌ను అభినందించారు.

మహానంది క్షేత్ర పండితులకు అవార్డులు



మహానంది పండితుడు రవిశంకర్ అవధానికి అవార్డు ప్రధానం చేస్తున్న పీఠాధిపతి

మంత్రాలయం, మార్చి 14: మంత్రాలయం రాఘవేంద్రస్వామి గురు వైభవోత్సవాల్లో నాల్గవ రోజు గురువారం రాత్రి మహానంది పుణ్యక్షేత్రంలోని పండితులకు పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు అవార్డులు ప్రదానం చేశారు. నంద్యాల జిల్లా మహానంది పుణ్యక్షేత్రం విద్వాన్ రవిశంకర్ అవధానికి, వేద పండితులకు, అదే పుణ్యక్షేత్రం విద్వాన్ వెంకటదుర్గ నాగేశ్వరశర్మ వేద పండితులకు పీఠాధిపతి నగదు, అవార్డు, ప్రశంసాపత్రం, వెండిగిన్నె, మెమెంటో, ఫలపుష్ప మంత్రాక్షితలు ఇచ్చి సత్కరించారు.

యువకుడి ఆత్మహత్య

కర్నూలు, మార్చి 14: మూడో పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారపేటకు చెందిన ఉమామహేశ్వరరెడ్డి (26) అనే యువకుడు ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన గురువారం జరిగింది. ఉమామహేశ్వరరెడ్డి కారు డ్రైవర్‌గా పని చేస్తూ ప్రమాదానికి గురి కావడంతో ఇంట్లోనే ఉంటున్నాడు. తాగుడుకు బానిసై జీవితంపై విరక్తి చెంది ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకున్నాడు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురికి తరలించారు. తల్లి శ్రీదేవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అడుగంటుతున్న జలాశయాలు

- ఎండుతున్న పైర్లు
- గొంతెండుతున్న జనాలు

కర్నూలు(అగ్రికల్చర్), మార్చి 14: గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రధాన నదులైన కృష్ణా, తుంగభద్ర నదుల పరివాహక ప్రాంతం ఎడారిగా కనిపిస్తున్నది. నదుల మీద ఆధారపడి రైతులు తొవ్వుకున్న బోరుబావుల్లో చుక్కనీరు లేక ప్రస్తుత రబీ పంటలు కళ్లెదుటే ఎండిపోతున్నాయి. అంతేగాక జూన్, జూలై నెలల వరకు ఉమ్మడి కర్నూలు జిల్లాలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు ముందు చూపుతో నీటిని నిల్వ చేసిన జలాశయాలు అడుగంటుతున్నాయి. తుంగభద్ర జలాశయంలో 1,633 అడుగుల నీటి మట్టం వద్ద 105.788 టీఎంసీల నీరు పూర్తినిల్వ సామర్థ్యంగా ఉంది. అయితే.. తీవ్ర వర్షాభావ పరిస్థితుల కారణంగా ఈ జలాశయానికి ఏ సీజన్‌లో కూడా పూర్తి స్థాయి నీటి నిల్వ చేరలేదు. మరింత దారుణంగా ప్రస్తుతం ఈ జలాశయంలో 1,583.65 నీటి మట్టం వద్ద కేవలం 6.47 టీఎంసీల నీరు మాత్రమే నిల్వ ఉంది. అదే విధంగా శ్రీశైలం జలాశయంలో పూర్తి స్థాయి నీటి మట్టం 845 అడుగుల వద్ద 215 టీఎంసీల నీరు నిల్వ చేస్తున్నారు. ప్రస్తుతం ఈ జలాశయంలో నీటి నిల్వలు డెడ్ స్టోరేజీకి చేరాయి. ఏపీతో పాటు తెలంగాణ, ప్రకాశం జిల్లాలకు సాగు, తాగునీరు అందించేందుకు ఏ మాత్రం అవకాశం లేకుండా పోయింది. ప్రస్తుతం ఈ జలాశయంలో కేవలం 811.60 అడుగుల వద్ద కేవలం 75.22 టీఎంసీల నీరు మాత్రమే నిల్వ ఉంది. డోన్, కర్నూలు, ఎమ్మిగనూరు, కోడుమూరు, పత్తికొండ నియోజకవర్గాల్లో సాగు, తాగునీటికి ప్రధాన నీటి వనరుగా ఉన్న గాజులదిన్నె ప్రాజెక్టులో 4.5 టీఎంసీల నీటి నిల్వకు గాను ప్రస్తుతం 1.695 టీఎంసీల నీరు మాత్రమే నిల్వ ఉంది. కర్నూలు నగరానికి తాగునీటిని అందించే సుంకేసుల జలాశయం పూర్తి స్థాయి నీటి నిల్వ 1.2 టీఎంసీలు కాగా, కేవలం 0.089 టీఎంసీల నీరు మాత్రమే నిల్వ ఉంది. హంద్రీనీవా కాలువ ద్వారా నీటిని నింపుతున్న క్రిష్ణగిరి రిజర్వాయరులో ఉన్న 0.164 టీఎంసీల నీరు జూన్ వరకు తాగునీటి అవసరాలు తీర్చాల్సి ఉంది. అందువల్ల ఈ నీటిని ఇతర అవసరాలకు మళ్లించకుండా జాగ్రత్తగా కాపాడుతున్నారు. వెలుగోడు బ్యాలెన్సింగ్ రిజర్వాయరులో 16.95 టీఎంసీల నీటికి గాను గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ జలాశయంలో ప్రస్తుతం 1.478 టీఎంసీల నీరు మాత్రమే నిల్వ ఉంది. ఈ జలాశయం నీటినే నంద్యాల తాగునీటి అవసరాలకు వినియోగిస్తున్నారు. గోరుకల్లు రిజర్వాయరులో 12.5 టీఎంసీల నీటి నిల్వకు గాను కేవలం 2.5 టీఎంసీల నీరు మాత్రమే నిల్వ ఉంది. అవుకు రిజర్వాయరులో 4.148 టీఎంసీల నీటి నిల్వ ఉండాలి. కానీ ప్రస్తుతం 0.894 టీఎంసీల నీరు మాత్రమే నిల్వ ఉంది. పందికోన రిజర్వాయరులో 1.126 టీఎంసీలకు గాను కేవలం 0.50టీఎంసీల నీరు మాత్రమే ఉంది. పులికనుమలో 1.243 టీఎంసీల నీటి నిల్వకు గాను కేవలం 0.23 టీఎంసీల నీరు మాత్రమే నిల్వ ఉంది. త్వరితగతిన అడుగంటుతున్న జలాశయాల్లో నీటి నిల్వలను చూసి నీటి పారుదల శాఖ అధికారులు జూలై వరకు ఈ కొద్దిపాటి నీటితో ప్రజల దాహార్తిని తీర్చేందుకు ఎలా సర్దుబాటు చేయాలని మదనపడుతున్నారు.



ఎండిపోయిన తుంగభద్ర నది పరివాహక ప్రాంతం

పేదల సంక్షేమమే ధ్యేయం: సీఎం

- ఈబీసీ నేస్తం నిధుల విడుదలకు బటన్ నొక్కిన జగన్
- వర్చువల్‌గా వంద పడకల ఆస్పత్రి ప్రారంభం

బనగానపల్లె, మార్చి 14: పేదల సంక్షేమమే తన ధ్యేయమని ఏపీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. గురువారం బనగానపల్లె పట్టణంలోని ఉన్నత పాఠశాలలో ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ఆధ్వర్యంలో ఈబీసీ నేస్తం నిధులకు సబంధించి బటన్ నొక్కారు. మూడో విడత నిధులు విడుదల చేసేందుకు బనగానపల్లెకు ఉద యం 11.30 గంటలకు ఉన్నత పాఠశాల మైదానానికి చేరుకు న్నారు. ఓర్వకల్లు విమానాశ్రమం నుంచి కర్నూలు రహదారిలోని అయ్యప్ప స్వామి ఆలయం ఎదురుగా ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌కు చేరుకున్నారు. సీఎంకు మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి, ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, జడ్పీ చైర్మన్ ఎర్రబోతుల వెంకటరెడ్డి, ఎంపీ పోచా బ్రహ్మానందారెడ్డి తదితరులు స్వాగతం పలికారు. అక్కడ నుంచి కాన్వాయ్‌లో ఉన్నత పాఠశాల మైదానంలోని ప్రాంగణానికి సీఎం చేరుకున్నారు. సభా ప్రాంగణానికి చేరుకున్న తర్వాత బనగానపల్లె పట్టణంలో రూ.22 కోట్ల వ్యయంతో నిర్మించిన వంద పడకల ప్రాంతీయ ప్రభుత్వ వైద్యశాలను సభా ప్రాంగణం నుంచే వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన బహిరంగ సభలో సీఎం జగన్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా వైఎస్సార్ ఈబీసీ నేస్తం ద్వారా 45 నుంచి 60 ఏళ్ల వయస్సుగల ఓబీసీ వర్గాలు 4,19, 583 మందికి రూ.629 కోట్ల ఆర్థిక సాయం అందించినట్లు తెలిపారు. ప్రతి ఏటా రూ.15,000 చొప్పున మూడేళ్లుగా రూ.45వేలు అందించామన్నారు. మహిళలు వారి కాళ్లమీద వారు నిలబడేలా చేశామన్నారు. టీడీపీ, జనసేన, బీజేపీలు ఒక కూటమిగా ఏర్పాటై మీదగ్గరకు వస్తున్నారని జాగ్రత్తగా ఉండాలన్నారు. ఈ పార్టీలు గెలిస్తే సంక్షేమ పథకాలు అందవన్నారు. చంద్రబాబు నాయుడు గతంలో ఎన్నికల మ్యానిఫెస్టోలో ఇచ్చిన వాటిని అమలు చేయలేదన్నారు. పవన్ కళ్యాణ్ పెళ్లిళ్లపై మరోసారి సీఎం జగన్ నోరు పారేసుకున్నారు. ఆంధ్రజ్యోతి, ఈనాడు, పత్రికలు చదువ వద్దని, ఏబీఎన్, ఈటీవీ, టీవీ-5 చానెళ్లను చూడవద్దని చెప్పారు. కార్యక్రమంలో ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథరెడ్డి, జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి, రాష్ట్ర నీటి పారుదలశాఖ సలహాదారుడు గంగుల ప్రభాకరరెడ్డి, శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి, నంద్యాల ఎంపీ పోచా బ్రహ్మానందారెడ్డి, నంద్యాల ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి, ఆళ్లగడ్డ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి, ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా, ఏపీ ఇరిగేషన్ శాఖ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ కర్రా గిరిజ, రాష్ట్ర మార్క్‌ఫెడ్ చైర్మన్ పీపీ నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఈబీసీ నేస్తం చెక్‌ను పంపిణీ చేస్తున్న సీఎం జగన్

సీఎం జగన్ రాజీనామా చేయాలి : టీడీపీ

ఓర్వకల్లు, మార్చి 14: ఏపీపీఎస్సీలో జరిగిన అక్రమాలపై తక్షణమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి రాజీనామా చేయాలని టీడీపీ పాణ్యం ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే గౌరు చరిత, నంద్యాల టీడీపీ అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్ డిమాండ్ చేశారు. ఈ అక్రమాలను నిరసిస్తూ గురువారం మండలంలోని జాతీయ రహదారిపై రాస్తారోకో ధర్నా కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా గౌరు చరిత, రాజశేఖర్ మాట్లాడుతూ ఏపీపీఎస్సీలో రూ.150 కోట్ల కుంభకోణం జరిగిందన్నారు. సంతలో పశువులను అమ్ముకున్నట్లు జగన్ రెడ్డి ఏపీపీఎస్సీలో ఉద్యోగాలను అమ్ముకున్నారన్నారు. గ్రూప్-1 మెయిన్స్‌లో ప్రభుత్వ అక్రమాలు హైకోర్టులో బహిర్గం చేసిందని, ఒక్కో డిప్యూటీ కలెక్టర్ పోస్టుకు రూ.2.50 కోట్లు, ఒక్కో డీఎస్పీ పోస్టుకు రూ.1.50 కోట్లు వసూలు చేశారని ఆరోపించారు. ఏపీపీఎస్ కార్యదర్శి ఆంజనేయులు, చైర్మన్ గౌతమ్ సవాంగ్‌లపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఏ మాత్రం నైతిక విలువలున్న జగన్ రెడ్డి తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు గోవిందరెడ్డి, చదువుల సుధాకర్ రెడ్డి, బ్రాహ్మణపల్లి నాగిరెడ్డి, వెంకటరమణ, వెంకటసుబ్బయ్య, భాస్కర్‌రెడ్డి, కేవీ మధు, వేణు, బజారు, టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న గౌరు చరిత, మల్లెల రాజశేఖర్, నాయకులు

దేహమే దేవాలయం.. జీవుడే దేవుడు

త్రిదండి శ్రీమన్నారాయణ చిన్న జీయర్ స్వామీజీ



గోదా గోకులంలో భక్తులను ఉద్దేశించి ప్రసంగిస్తున్న త్రిదండి శ్రీమన్నారాయణ చిన్న జీయర్ స్వామీజీ

కర్నూలు(కల్చరల్), మార్చి 14: దేహమే దేవాలయమని, జీవుడే దేవుడని త్రిదండి శ్రీమన్నారాయణ చిన్న జీయర్ స్వామీజీ భక్తులకు ఉద్బోధించారు. కర్నూలు నగర శివారులో, మామిదాల పాడులోగల గోదా రంగనాథస్వామి దేవస్థానంలో కొనసాగుతున్న ఆలయ ప్రథమ వార్షిక బ్రహ్మోత్సవాలకు ముఖ్య అతిథిగా చిన్న జీయర్ స్వామి విచ్చేశారు. ఉత్సవాల్లో మూడో రోజు గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జీవారాధనే దైవారాధన అన్నారు. బుద్ధి భ గవంతునిపై నిలపడమే ఉత్తమ మానవ ధర్మమని అన్నారు. సాయంత్రం స్వామి, అమ్మవార్లను సూర్యప్రభ వాహన సేవ చేశారు. ఈ కార్యక్రమంలో పీఠాధిపతులు అష్టాక్షరీ సంపత్కుమార రామానుజ జీయర్ స్వామీజీ, అష్టాక్షరీ బృందావన రామానుజ జీయర్ స్వామీజీ, ప్రయాగ్ రాజ్ రాఘవ ప్రపన్న జీయర్ స్వామీజీ, గోదాగోకులం వ్యవస్థాపక అధ్యక్షుడు మారం నాగరాజ గుప్త తదితరులు పాల్గొన్నారు.

రమణీయం.... రథోత్సవం



గూళ్యంలో జోడు రథోత్సవం

హాలహర్వి, మార్చి 14: ఆంధ్ర, కర్ణాటక రెండు రాష్ట్రాల ఇలవేల్పు గాదిలింగేశ్వర, సిద్ధేశ్వరస్వాముల జోడు రథోత్సవం నేత్రానందంగా జరిగింది. గురువారం ఉదయం నుంచి స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం 6 గంటలకు దేవాదాయశాఖ కార్యదర్శి రాధాకృష్ణ రెడ్డి రఘునందన గౌడు, కరుణం రాఘవేంద్రరావు రథచక్రాలకు పూజలు నిర్వహించారు. వేదపండితులు మంత్రాలు వల్లిస్తుండగా గాదిలింగేశ్వరస్వామినామస్మరణంతో మారు మోగింది. ప్రధాన వీధుల్లో దాదాపు రెండు లక్షల పైగా జనం రథాలను లాగారు. జోడురథాలు ఒకేసారి కదిలి రావడంతో వీనులవిందుగా మారింది. కార్యక్రమంలో ఆలయ కమిటీ నిర్వాహకులు బజారప్ప, మోక మైలరప్ప, కురువ మల్లన్న, గాదిలింగప్ప, మారెప్ప పాల్గొన్నారు

సైకో పాలనకు చరమగీతం పాడండి

- టీడీపీ సూపర్ సిక్స్ పథకాలతో ప్రజల జీవితాల్లో వెలుగు
- డోన్ టీడీపీ అభ్యర్థి కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి



బేతంచెర్ల: ప్రచారంలో కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి

బేతంచెర్ల, మార్చి 14: రాష్ట్రంలో సైకో పాలనకు చరమగీతంపాడి చంద్రబాబును ముఖ్యమంత్రిని చేసుకోవాలని డోన్ టీడీపీ అభ్యర్థి కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి అన్నారు. గురువారం టీడీపీ మండల కార్యదర్శి షేక్షావలి చౌదరి ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమానికి కోట్ల సూర్యప్రకాష్ రెడ్డితో పాటు రాష్ట్ర కార్యదర్శి వై.నాగేశ్వరరావు యాదవ్, మండల కన్వీనర్ ఎల్ల నాగయ్య, పట్టణ అధ్యక్షురాలు బుగ్గన ప్రసన్నలక్ష్మి, జాకీరుల్లా బేగ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా కోట్ల మాట్లాడుతూ డోన్ నియోజకవర్గంలో టీడీపీ జెండాను ఎగురవేయాలని అన్నారు. జగన్ రెడ్డి రాష్ట్రంలో ఉన్న సహజ వనరులన్నీ కొల్లగొట్టారని, వనరులను రాష్ట్ర ప్రయోజనాలకు ఉపయోగించుకోకుండా తన సొంత ప్రయోజనాలను అక్రమ మార్గంలో దోచుకున్నారని అన్నారు. సంపదను సృష్టించలేని జగన్.. రాష్ట్రంలో ఉన్న సహజ వనరులను తన బినామి కంపెనీలకు మళ్లించారని ఆరోపించారు. మరోసారి వైసీపీ అధికారంలోకి వస్తే రాష్ట్రం దివాలా తీయడం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో పోలూరు వెంకటేశ్వరరెడ్డి, పోలూరు రాఘవరెడ్డి, భీమేష్ రెడ్డి, ఉన్నం సుధాకర్, కాకర్ల తిరుమలేష్ చౌదరి, బుగ్గన ఆనంద్ రెడ్డి, కేపీ భూపాల్ రెడ్డి, రవీంద్ర నాయక్, రూబెన్, రేగటి భీమారెడ్డి, జావాజీ వెంకటేశ్వర్లు, ముళ్ల, రామాంజనేయులు, టైలర్ రాముడు, ఫయాజ్, గుడివాడ క్రిష్ణమూర్తి, ఎంఎస్ మధులోకేశ్వరెడ్డి, కేవీ సుబ్బారెడ్డి, చంద్ర, సిమెంటునగర్ రాముడు, గూటంశివ, బుక్కాపురం లక్ష్మన్న తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

- దైవదర్శనానికి వెళ్లి తిరిగి వస్తుండగా ఘటన
- లారీ కింద పడిన బెంగళూరు వాసి

తుగ్గలి, మార్చి 14: బెంగళూరు చెందిన కార్తీక్, రాఘవేంద్ర ద్విచక్ర వాహనంపై మంత్రాలయం రాఘవేంద్రస్వామి దర్శనానికి వచ్చి తిరిగి వెళుతుండగా వీరి బైక్ అదుపు తప్పి లారీ కింద పడి కార్తీక్ (31) అక్కడిక్కడే మృతి చెందాడు. ఈ ఘటన జొన్నగిరి సమీపంలో గురువారం జరిగింది. కర్ణాటక రాష్ట్రం దక్షిణ బెంగుళూరు చెందిన ఆదిశేషయ్య కుమారుడు కార్తీక్ (31) రాఘవేంద్ర అనే వ్యక్తితోపాటు మంత్రాలయం వెళ్లి తిరిగి వస్తుండగా.. జొన్నగిరి వద్ద వీరి బైక్ అదుపు తప్పి ఎదురుగా వస్తున్న వాహనాలను తప్పించబోయి ఎగిరి లారీ కింద పడటంతో కార్తీక్ తలపై లారీ వెళ్లింది. దీంతో కార్తీక్ అక్కడికక్కడే మృతి చెందాడు. రాఘవేంద్రకు స్వల్పగాయాలయ్యాయి. జొన్నగిరి పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పత్తికొండ వైద్యశాలకు తరలించారు. వారి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ రంగస్వామి తెలిపారు.

నిర్బంధ సమావేశం



సమావేశం జరిగిన పార్క్‌కు వేసిన తాళం

నందికొట్కూరు, మార్చి 14: నందికొట్కూరు మెప్మా అధికారులు సమావేశానికి పిలిపించి బయటకు వెళ్లకుండా నిర్బంధించారు. గురువారం నందికొట్కూరు పట్టణంలోని జై కిసాన్ పార్కులో వైఎస్ఆర్ చేయూత 4వ విడత కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సమావేశం మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి, కమిషనర్ సుధాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమానికి హాజరైన వారు ఉక్కపోతకు తట్టుకోలేక బయటకు వెళ్లేందుకు ప్రయత్నించగా పార్కు ప్రధాన గేటును మూసి వేసి, పొదుపు సంఘాల మహిళలను కాపలా ఉంచారు. దీంతో అటు బయటకు వెళ్లలేక, సమావేశంలో కూర్చోలేక మహిళలు ఇబ్బందిపడ్డారు. ఇలాంటి సమావేశాలకు మరోసారి హాజరు కాకూడదని మహిళలు అనుకుంటూ వెళ్లిపోయారు.

వైద్య ఉద్యోగుల సమస్యలు పరిష్కరిస్తాం



డీఎంహెచ్‌వోకు జీవో ఉత్తర్వుల కాపీలను అందజేస్తున్న ఏపీ హంసా అసోసియేషన్ నాయకులు

కర్నూలు(హాస్పిటల్), మార్చి 14: వైద్య ఆరోగ్యశాఖ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామని ఏపీ హెల్త్ అడ్మినిస్ట్రేషన్ మెడికల్ సర్వీసెస్ అసోసియేషన్ (హంసా) నాయకులు అన్నారు. గురువారం ఏపీ హంసాకు రాష్ట్ర ప్రభుత్వం గుర్తింపు సంఘంగా ఇచ్చిన జీవో.నెంబర్.24 కాపీల ఉత్తర్వులను నాయకులు డీఎంహెచ్‌వో బి. రామగిడ్డయ్యకు అందజేశారు. కాంట్రాక్టు ఉద్యోగుల రెగ్యులరైజేషన్ ఈ ప్రొసిడింగ్స్ ఆర్డర్స్ ఇవ్వాలని హంసా నాయకులు కోరగా, త్వరలో అందజేస్తామని డీఎంహెచ్‌వో హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఏపీ హంసా జిల్లా అధ్యక్షుడు రఘుబాబు, ప్రధాన కార్యదర్శి సయ్యద్ షఫి, కర్నూలు సిటీ చైర్మన్ తెలుగు గోవిందు, జిల్లా వర్గ సభ్యులు వెంకటస్వామి, నాయకులు కరుణానిధి, చిన్నరాముడు, మాలిక్ బాషా, వేణుగోపాల్ పాల్గొన్నారు.

ఘనంగా జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవం



కేక్ కట్ చేస్తున్న జనసేన నాయకులు

కర్నూలు(న్యూసిటీ), మార్చి 14: జనసేన పార్టీ 11వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గురువారం స్థానిక బిర్లా కాంపౌండులోని పార్టీ ఉమ్మడి జిల్లాల కో ఆర్డినేటర్ చింతా సురేష్‌బాబు, నాయకులు కలిసి కేక్ కట్ చేసి సంబ రాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా సురేష్‌బాబు మాట్లాడుతూ పార్టీ అధినేత పవన్‌కళ్యాణ్ ఆశయాలు, సిద్ధాంతాలకు కట్టుబడి నాయకులు, కార్యకర్తలు పని చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో నాయకులు పీబీవీ సుబ్బయ్య, మంజునాథ్, బజారి, సుధాకర్, షబ్బీర్, కృష్ణబాబు పాల్గొన్నారు.

మందుల స్టాక్‌ను రికార్డుల్లో నమోదు చేయాలి

సి.బెళగల్, మార్చి 14: రైతులకు విక్రయించే మందులను స్టాక్‌ను రికార్డుల్లో నమోదు చేయాలని మండల వ్యవసాయ అధికారి మల్లేష్‌కుమార్ ఎంపీఈవోలకు సూచించారు. గురువారం మండలంలోని చింతమానుపల్లె గ్రామంలోని రైతు భరోసా కేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఏవో మల్లేష్‌కుమార్ మాట్లాడుతూ మండలంలోని రైతు భరోసా కేంద్రాల్లోని మందుల స్టాక్ నిల్వ రిపోర్టును తయారు చేసి ఆన్‌లైన్‌లో వ్యవసాయ కార్యాలయానికి పంపాలని, రైతులకు భూసార పరీక్షలపై అవగాహన కల్పించాలని ఎంపీఈవోలకు సూచించారు. ఏవో వెంట ఎంపీఈవోలు సిద్దు, వెంకటేశ్వర్లు ఉన్నారు.

మూడు రాజధానులకు శఠగోపం

రాయలసీమ హక్కులు అడిగితే అక్రమ అరెస్టులా?



పోలీసుల అదుపులో సీమ కృష్ణ

కర్నూలు (అర్బన్), మార్చి 14: సీఎం జగన్మోహన్‌రెడ్డి మూడు రాజధానులకు శఠగోపం పెట్టారని రాయలసీమ విద్యార్థి సమైఖ్య అధ్యక్షుడు సీమ కృష్ణ అన్నారు. గురువారం సీఎం జగన్‌రెడ్డి జిల్లా పర్యటనను పురస్కరించుకుని త్రీ టౌన్ పోలీసులు అరెస్టు చేశారని వాపోయారు. అసెంబ్లీ సాక్షిగా అభివృద్ధి వికేంద్రీకరణ పేరుతో మూడు రాజధానుల బిల్లు తీసుకొచ్చి మళ్లీ వాటిని వెనక్కి తీసుకుని ఇంతవరకు బిల్లు ప్రవేశపెట్టలేదన్నారు. రాయలసీమకు కర్నూలుకు న్యాయ రాజధాని ప్రకటించలేదని, స్థల సేకరణ కూడా చేయలేదని మండిపడ్డారు. శ్రీబాగ్ ఒప్పందం పేరుతో రాయలసీమకు తీవ్ర అన్యాయం చేశారని ధ్వజమెత్తారు. వైసీపీకి రాబోయే ఎన్నికల్లో ప్రజలు బుద్ధి చెపేందుకు సిద్దంగా ఉన్నారన్నారు. ఈకార్యక్రమంలో భూషణ్ గణేష్, దస్తగిరి పాల్గొన్నారు.

గోదా గోకులంలో టీజీ భరత్ పూజలు



టీజీ భరత్‌ను సత్కరిస్తున్న త్రిదండి శ్రీమన్నారాయణ చిన్న జీయర్ స్వామీజీ

కర్నూలు(కల్చరల్), మార్చి 14: నగర శివారులో మామిదాలపాడులోని గోదాదేవి రంగనాథస్వామి దేవస్థానం (గోదాగోకులం)లో గురువారం కొనసాగుతున్న దేవస్థాన ప్రథమ వార్షిక బ్రహ్మోత్సవాల్లో కర్నూలు టీడీపీ అభ్యర్థి టీజీ భరత్ పాల్గొని పూజలు చేశారు. వేదపండితులు ఆయనచే శాస్త్రోక్తంగా పూజలు నిర్వ హింపజేసి, తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజ రైన త్రిదండి శ్రీమన్నారాయణ చిన్న జీయర్ స్వామీజీ ఆశీర్వాదా లను టీజీ భరత్ తీసుకున్నారు. టీజీ భరత్‌కు శాలువ కప్పి పూలమాలతో చిన్న జీయర్ స్వామి సన్మానించారు. టీజీ భరత్ వెంట పారిశ్రామికవేత్త టీజీ శివరాజప్ప ఉన్నారు. కాగా గోదాగోకులంలో జరుగుతున్న వార్షిక బ్రహ్మోత్సవాల్లో జిల్లా న్యాయధికారి శ్రీనివాసులు దంపతులు, కర్నూలు మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డి, కేడీసీసీ బ్యాంకు ఛైర్ పర్సన్ ఎస్వీ విజయ మనోహరి, వీహెచ్‌పీ రాష్ట్ర అధ్యక్షుడు నందిరెడ్డి సాయిరెడ్డి, సహ కార్యదర్శి పాణేశ్, జిల్లా అధ్యక్షుడు గోరంట్ల రమణ, జిల్లా కార్యదర్శి భానుప్రకాశ్, భజరంగ్‌దళ్ రాష్ట కన్వీనర్ టి.ప్రతాపరెడ్డి, భానుప్రకాశ్, ఆవోపా చీఫ్ నాగేశ్వరరావు, భక్తులు పాల్గొన్నారు.

మహిళల అభ్యున్నతికి కృషి

కర్నూలు టీడీపీ అభ్యర్థి టీజీ భరత్



టీడీపీలో చేరిన మహిళలతో టీజీ భరత్

కర్నూలు(అర్బన్), మార్చి 14: మహిళల అభ్యున్నతికి కృషి చేస్తానని కర్నూలు టీడీపీ అభ్యర్థి టీజీ భరత్ అన్నారు. గురువారం నగరంలోని ఐదో వార్డు చిత్తారి వీధికి చెందిన మహిళలు టీడీపీ నాయకురాలు లలితమ్మ ఆధ్వర్యంలో మౌర్యఇన్‌లోని టీజీ భరత్ కార్యాలయంలో ఆయనకు మద్దతు ఇచ్చి పార్టీలో చేరారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన మహిళలు మాట్లాడుతూ టీజీ భరత్ గెలుపుతో కర్నూలు ప్రజలకు మేలు జరుగుతుందన్నారు. అనంతరం టీజీ భరత్ మాట్లా డుతూ కర్నూలులో మహిళలకు భద్రత, ఆర్థిక భరోసా కల్పించడం తన బాధ్యతగా తీసుకుంటానన్నారు. కొత్త పరిశ్రమలు తీసుకొచ్చి చదువుకున్న వారికి ఉద్యోగాలతో పాటు చదువులేని వారికి సైతం ఉపాధి కల్పించేందుకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో మహిళా నాయకులు రాజ్యలక్ష్మి, విజయలక్ష్మి పాల్గొన్నారు,

'టీజీ భరత్ గెలుపునకు కృషి చేస్తాం'

కర్నూలు(కల్చరల్): కర్నూలు టీడీపీ అభ్యర్థి టీజీ భరత్ గెలుపునకు కృషి చేస్తామని పలువురు బ్రాహ్మణ సంఘాల నేతలు అన్నారు. గురువారం మౌర్యఇన్‌లోని టీజీ భరత్ కార్యాలయంలో వారు కలిశారు. ఈ సందర్భంగా ఏపీ బ్రాహ్మణ సేవా సంక్షేమ మిత్ర మండలి వ్యవస్థాపక అధ్యక్షుడు సండేల్ చంద్రశేఖర్‌రావు మాట్లాడుతూ నిరుపేద బ్రాహ్మణుల కోసం చంద్రబాబు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేశారన్నారు. కార్యక్రమంలో మిత్ర మండలి కార్యదర్శి కంచుగంటల శ్యామసుందరరావు, చల్లా నాగరాజ శర్మ, గౌరవాధ్యక్షుడు చెరువు వెంకట దుర్గాప్ర సాద్, యువజన విభాగం, పరశురామ్ కమిటీ అధ్యక్షుడు దార్వాడ ఆనందరావు, ఉపాధ్యక్షుడు సముద్రాల శ్రీధర్ బాబు, రాష్ట్ర అర్చక సంఘం అధ్యక్షుడు టీవీ రవిచంద్ర శర్మ పాల్గొన్నారు.

ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలను ప్రారంభించిన టీజీ భరత్

కర్నూలు(స్పోర్ట్స్): స్థానిక ఎస్టీబీసీ కళాశాల మైదానంలో నిర్వహించిన బంగారుపేట ప్రీమియర్ లీగ్ సీజన్-3 క్రికెట్ పోటీలను కర్నూలు టీడీపీ అభ్యర్థి టీజీ భరత్ గురువారం ప్రారంభించారు. అనంతరం ఆయన క్రీడాకారు లను పరిచయం చేసుకున్నారు. ఈ సందర్భంగా టీజీ భరత్ మాట్లాడుతూ క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు. ఈ పోటీల్లో మొదటి, రెండు స్థానాలు గెలిచిన జట్లకు టీజీవీ సంస్థల తరపున నగదు బహుమతులు అందజేస్తామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో నిర్వాహకులు సురేష్, శేఖర్, శివ, గోపాల్ పాల్గొన్నారు.

బీసీలకు వెన్నుదన్నుగా టీడీపీ

కల్లూరు బీసీ డిక్లరేషన్ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే గౌరు చరిత



టీడీపీలో చేరిన వారితో గౌరు చరిత, మల్లెల రాజశేఖర్

కల్లూరు, మార్చి 14: రాష్ట్రంలో బీసీలకు తెలుగుదేశం పార్టీ వెన్నుదన్నుగా నిలిచిందని పాణ్యం టీడీపీ అభ్యర్థి గౌరుచరిత అన్నారు. గురువారం దూపాడు పరిధిలోని శ్రీలక్ష్మీ వెంకటేశ్వర కళ్యాణ మండపంలో మండల అధ్యక్షుడు డి.రామాంజనేయులు ఆధ్వర్యంలో చేపట్టిన టీడీపీ జనసేన బీసీ డిక్లరేషన్- మండల విస్తృతస్థాయి సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. నంద్యాల జిల్లా టీడీపీ అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్, నంద్యాల పార్లమెంట్ తెలుగు మహిళా అధ్యక్షురాలు కె.పార్వతమ్మ పాల్గొన్నారు. ఈ సందర్భంగా గౌరుచరిత మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో దివంగత నందమూరి తారకరామారావు పార్టీ స్థాపించిన నాటి నుండి బీసీలు రాజకీయాల్లో పురోగమించారని అన్నారు. చంద్రబాబు బీసీల పక్షపాతి అని, టీడీపీ అధికారంలోకి రాగానే 50 ఏళ్ళు పైబడిన బీసీలకు నెలకు రూ.4వేల పింఛన్ ఇవ్వనుందని అన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ వాకిటి మాధవి, పుసులూరు ప్రభాకర్‌రెడ్డి, ఎన్‌వి. రామకృష్ణ, ప్రభాకర్‌యాదవ్, జే.గంగాధర్‌గౌడ్, కాసాని మహేష్‌గౌడ్, రాయలసీమ విద్యార్థి విభాగం జేఏసీ చైర్మన్ శ్రీరాములు, జనసేన నాయకుడు సలాం పాల్గొన్నారు.

● గౌరు చరిత సమక్షంలో టీడీపీలో చేరిక: కల్లూరు మండలం వామసముద్రం గ్రామానికి చెందిన వైసీపీ వార్డు మెంబర్ రంగడుతో పాటు వందమంది గౌరుచరిత సమక్షంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. గురువారం దూపాడులోని శ్రీలక్ష్మీ వెంకటేశ్వర కళ్యాణ మండపంలో పుసులూరు ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో వైసీపీని వీడి వీరు టీడీపీలో చేరారు. పార్టీలో చేరిన వారిలో సంజీవ, విష్ణు, వేణుగోపాల్, గోకారి, జగన్నాథం, మల్లికార్జున, ప్రవీణ్, మద్దిలేటి, పెద్దమాదన్న, రామాంజి, చిన్నపుల్లయ్య, సురేష్, ఉదయ్, చిన్నబాబు ఉన్నారు.

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి

ఓర్వకల్లు: టీడీపీ అధినేత, మాజీ సీఎం నారా చంద్రబాబునాయుడుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని మాజీ ఎమ్మెల్యే, పాణ్యం టీడీపీ అభ్యర్థి గౌరు చరితారెడ్డి, పార్టీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్ అన్నారు. గురువారం మండలంలోని గుడుంబాయితాండా, చెన్నం చెట్టిపల్లె, వెంకటాపురం గ్రామాల్లో బాబు ష్యూరిటీ- భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి టీడీపీ మేనిఫెస్టో కరపత్రాలు పంపిణీ చేశారు. అంతకుముందు కొమ్ముచెరువు ఆంజనేయస్వామి ఆలయంలో పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా గౌరుచరిత, రాజశేఖర్‌లు మాట్లాడుతూ ఆడబిడ్డలు ఆర్థికంగా నిలదొక్కుకోవ డానికి చంద్రబాబు కలలకు రెక్కలు అనే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ లక్ష్మణరావు, టీడీపీ మండల కన్వీనర్ గోవిందరెడ్డి, పాణ్యం వాణిజ్య విభాగం అధ్యక్షుడు బ్రాహ్మణ పల్లి నాగిరెడ్డి, నాయకులు మోహన్‌రెడ్డి, చదువుల సుధాకర్ రెడ్డి, మహబూబ్ బాషా, వెంకటరమణ, ఖాదర్‌బాషా, రజాక్, సుబ్బారెడ్డి, నాగ మల్లేష్, సంజీవ, వెంకటసుబ్బయ్య, పుల్లారెడ్డి, వేణు, బజారు పాల్గొన్నారు.

● **టీడీపీలో 70 కుటుంబాలు చేరిక:** మండలంలోని గుడుంబాయి తండాలో గౌరు చరిత, మల్లెల రాజశేఖర్ ఆధ్వర్యంలో వైసీపీ నుంచి 70 కుటుంబాలు టీడీపీలో చేరారు. వీరికి టీడీపీ కండువాలు వేసి వారు పార్టీలోకి ఆహ్వానించారు. టీడీపీలో చేరిన వారిలో లక్ష్మణ్ నాయక్, సుంకన్న నాయక్, సప్లి నాయక్, పుల్లన్న నాయక్, కోనే నాయక్, శ్రీను నాయక్, రాజు నాయక్ ఉన్నారు.

'నదులను రక్షించకపోతే మానవ మనుగడకే ప్రమాదం'



కరపత్రాలు విడుదల చేస్తున్న మన్సూర్ రెహమాన్, కేసీ కల్కూర

కర్నూలు(కల్చరల్), మార్చి 14: జీవ నదులను పరిరక్షించకపోతే మానవ మనుగడకే ప్రమాదమని జిల్లా మేధావుల వేదిక వ్యవస్థాపకులు, విశ్రాంత ప్రిన్సిపల్ ఆచార్య మన్సూర్ రహమాన్, సంస్థ గౌరవాధ్యక్షుడు కేసీ కల్కూర అన్నారు. గురువారం అంతర్జాతీయ నదుల దినోత్సవం సందర్భంగా జిల్లా మేధావుల వేదిక ఆధ్వర్యంలో, నగరంలోని మద్దూరునగర్‌లోగల పింగళి సూరన తెలుగుతోట సమావేశ హాలులో వివిధ సామాజిక సేవా సంస్థల ప్రతినిధులతో చర్చాగోష్ఠి నిర్వహించారు. ఈ గోష్ఠిలో వారు మాట్లాడుతూ హంద్రీ, తుంగభద్ర వంటి జీవ నదుల నడుమ విరాజిల్లిన నాగరికత కర్నూలు నగరానిదని గుర్తు చేశారు. ఈ రెండు నదులను పరిరక్షించుకోకపోతే భవిష్యత్తులో ముప్పు వాటిల్లుతుందని హెచ్చరించారు. హంద్రీ, తుంగభద్ర నదుల పరిరక్షణ కోసం ఒక నివేదికను తయారు చేసి కలెక్టర్, మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్, నీటి పారుదల శాఖ ముఖ్య ఇంజినీర్, కాలుష్య నియంత్రణ మండలి అధికారులకు సమర్పించారు. ఈ సమస్యను కేంద్ర జలవనరుల శాఖకు నివేదిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో చరిత్రోపన్యాసకుడు ఇమ్మానియేల్, తెలుగు భాషా వికాస ఉద్యమం సంస్థ అధ్యక్షుడు జేఎస్ఆర్‌కే శర్మ, గనులశాఖ విశ్రాంత జేడీ ఎంవీఆర్ చంద్రశేఖర్, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

నోటీసులు ఇవ్వడం సిగ్గు చేటు: ఎస్‌ఎఫ్ఐ



మాట్లాడుతున్న అబ్దుల్లా

కర్నూలు(ఎడ్యుకేషన్), మార్చి 14: ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి జిల్లాలో జగన్నాథగట్టుపైన జాతీయ న్యాయ యూనివర్సిటీకి శంకుస్థాపనకు హాజరు కానున్న సందర్భంగా ఎస్‌ఎఫ్ఐ నాయకులను ముందస్తుగా నోటీసులు ఇవ్వడం సిగ్గుచేటని ఎస్‌ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రంగప్ప, కార్యదర్శి అబ్దుల్లాలు అన్నారు. గురువారం వారు విలేకరులతో మాట్లాడుతూ జాతీయ న్యాయ యూనివర్సిటీకి శంకుస్థాపనకు వచ్చే సీఎం చట్టాన్ని, న్యాయాన్ని పక్కన పెట్టి అక్రమంగా రాత్రి పూట పోలీసులు వచ్చి నోటీసులు ఇవ్వడం దుర్మార్గమని అన్నారు. దివంగత సీఎం వైఎస్ రాజశేఖర్ రెడ్డి ఏర్పాటు చేసిన రాయలసీమ యూనివర్సిటీకి నిధులు కేటాయించకుండా ప్రొఫెసర్ల పోస్టులు భర్తీ చేయకుండా ఎక్కడ వేసిన సమస్యలు అక్కడే ఉన్న మీరు అక్కడికి వెళ్లకుండా ఈ న్యాయ యూనివర్సిటీకి శంకుస్థాపన చేయడానికి రావడం సిగ్గు చేటని అన్నారు. అన్ని యూనివర్సిటీలలో ఖాళీగా ఉన్న టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టు లను భర్తీ చేసిన తర్వాత జాతీయ న్యాయయూనివర్సిటీకి శంకు స్థాపన చేయాలని డిమాండ్ చేశారు. నగర అధ్యక్షులు అమర్, కార్యదర్శి సాయి ఉదయ్ పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

ఓర్వకల్లు, మార్చి 14: ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని సోమయాజులపల్లె గ్రామంలో రైతుభరోసా కేంద్రాన్ని, ఉప్పలపాడు గ్రామంలో సచివాలయం భవనాన్ని, కాల్వ, కాల్వబుగ్గ బ్రాహ్మణపల్లె గ్రామాల్లో రైతుభరోసా కేంద్రం, వైఎస్సార్ హెల్త్ వీలేజ్, హెల్త్ క్లీనిక్, గ్రామ సచివాలయం, వాటర్ పైపులను ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో కర్నూలు మార్కెట్ యార్డు చైర్మన్ ప్రభాకర్ రెడ్డి, జడ్పీటీసీ రంగనాథగౌడు, ఎంపీపీ తిప్పన్న పాల్గొన్నారు.

కర్నూలు న్యాయరాజధాని ఏమైంది..?

కర్నూలు(అర్బన్), మార్చి 14: కర్నూలుకు న్యాయరాజధాని తెస్తాను అని 2019 ఎన్నికల ముందు జగన్‌రెడ్డి హామీ ఇచ్చావు.. ఆ హామీ ఏమైందని కర్నూలు పార్లమెంట్ లీగల్ సెల్ అధ్యక్షుడు కేఈ జగదీష్ ప్రశ్నించారు. గురువారం టీడీపీ జిల్లా కార్యాలయంలో మాట్లాడుతూ ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఇచ్చిన హామీని విస్మరించి పదవీ కాలన్నీ పూర్తి చేసుకున్నావు.. ఇప్పుడు తానేదో కర్నూలుకు ఉద్ధరిస్తున్నట్లు వచ్చి శంకుస్థాపన చేసి లా కళాశాల ఏర్పాటు చేస్తున్నట్లు హడావుడి చేసిన ఓట్లు రాలవన్నారు. భూ యాజమాన్య చట్టాన్ని తీసుకువచ్చారన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు దాసెట్టి శ్రీనివాస్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్‌వీ ప్రసాద్, శ్రీనివాస్ భట్ పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

సి.బెళగల్, మార్చి 14: మండలంలోని కంబంద హాల్, గొల్లలదొడ్డి, సి.బెళగల్ గ్రామాల్లోని పోలింగ్ కేంద్రా లను సెక్టోరియల్ అధికారి సందీప్ పరి శీలిం చారు. ఈసందర్భంగా ఆయ న మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాలలో వసతుల లేని వాటిని పక్క గదిలోకి మార్చా లని బూత్‌లెవల్ అధికారులకు ఆదేశించారు. పోలింగ్ కేంద్రాల్లో విద్యుత్, తాగునీరు తదితర సౌకర్యాలు ఉండేలా చూసుకోవాలని బూత్ అధికారులకు సూచించారు.

గ్రామాల్లో పోలీసుల కవాతు



కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

గూడూరు, మార్చి 14: మండలంలోని కె నాగలాపురం పోలీస్ స్టేషన్ పరిధిలోని ఆయా గ్రామాల్లో పోలీసులు కవాతు నిర్వహించారు. గురువారం కె నాగలాపురం పోలీస్ స్టేషన్ పరిధిలోని పర్ల, కె.మార్కాపురం, సల్కాపురం గ్రామాల్లో కేంద్ర సాయుధ బలగాలతో పోలీసులు కవాతు నిర్వహించారు. కార్యక్రమంలో సెంట్రల్ ఫోర్స్ అసిస్టెంట్ కమాండెంట్ నబీన్ దాస్, కర్నూలు రూరల్ సర్కిల్ సీఐ కిరణ్ కుమార్ రెడ్డి, ఉలిందకొండ ఎస్ఐ నరేష్, కె నాగలాపురం పోలీసులు పాల్గొన్నారు.

టీడీపీలోకి పెరుగుతున్న వలసలు

పార్టీలో చేరిన బ్రాహ్మణదొడ్డి వైసీపీ నాయకులు



టీడీపీలో చేరిన బ్రాహ్మణదొడ్డి వైసీపీ నాయకులు

కర్నూలు(రూరల్), మార్చి14: కోడుమూరు నియోజకవర్గంలో టీడీపీలోకి వలసలు పెరుగుతున్నాయి. నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో ప్రతి రోజు ఏదో ఒక గ్రామం నుంచి వైసీపీ శ్రేణులు ఆ పార్టీకి గుడ్‌బై చెప్పి టీడీపీలో చేరుతున్నారు. తాజాగా సీ బెళగల్ మండలం బ్రాహ్మణదొడ్డికి చెందిన వైసీపీ నాయకులు, కార్యకర్తలు దాదాపు వంద కుటుంబాలు గురువారం కర్నూలులో ఎదురూరు విష్ణువర్ధన్‌రెడ్డి, టీడీపీ అభ్యర్థి బొగ్గుల దస్తగిరి సమక్షంలో పార్టీలో చేరారు. వారికి విష్ణువర్ధన్‌రెడ్డి టీడీపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా విష్ణు మాట్లాడుతు రాష్ట్రంలో టీడీపీ గెలుపు చారిత్రక అవసరమని, ప్రస్తుత పరిస్థితిలో చంద్రబాబును ముఖ్యమంత్రిని చేసుకోవాలంటే బొగ్గుల దస్తగిరిని గెలిపించాలని ఆయన గ్రామస్తులకు పిలుపునిచ్చారు. టీడీపీలో చేరిన వారిలో సొసైటీ చైర్మెన్ వడ్డె చిన్న లక్ష్మన్న, సచివాలయ కన్వీనర్ వడ్డె రంగన్న, గృహ సారథులు ఓబులేష్, చిన్న అర్లయ్య, ఆనంద్, చిన్న వెంకటేష్, స్కూల్ చెర్మెన్ నాగభూషణం, రాముడు, శ్రీను, చంటి, రాముడు, సుంకన్న, వెంకటేష్‌శేఖర్, ఆచారి, సుంకన్న, రఫీ,గోవిందు, నాగేష్, మధు, రఫీ తదితరులు ఉన్నారు.

● కోడుమూరు నియోజకవర్గ జనసేన పార్టీ సమన్వయకర్త ఆకెపోగు రాంబాబు ఆధ్వర్యంలో దాదాపు 300 మంది జనసేన కార్యకర్తలు, వీర మహిళలు కలసి టీడీపీ సీనియర్ నేత విష్ణువర్ధన్‌రెడ్డి, టీడీపీ అభ్యర్థి బొగ్గుల దస్తగిరిని కలిసి సంపూర్ణ మద్దతు తెలిపారు. అనంతరం కర్నూలు రూరల్ మండలం పంచలింగాల గ్రామంలో జనసేన కార్యలయాన్ని విష్ణువర్ధన్ రెడ్డి, బొగ్గుల దస్తగిరి కలిసి ప్రారంభించారు.

● గూడురు మండలం మునగాల గ్రామానికి చెందిన మాజీ సర్పంచు కుంటి గోపాల్, మాజీ ఎంపీటీసీ రామచంద్రుడు, రామాంజనేయులు, మద్దిలేటి, రంగన్న, కురువ మారెప్ప, చిన్నలక్ష్మన్న, వీరేష్ హనుమంతు తదితరులు టీడీపీ సీనియర్ నేత విష్ణువర్ధన్‌రెడ్డి, టీడీపీ అభ్యర్థి బొగ్గుల దస్తగిరిని మర్యాదపూర్వకంగా కలిసి మద్దతు ప్రకటించారు. నాయకులను కలిసిన వారిలో చిన్న అల్లీసా, నాయుడు, శివ, బ్రహ్మయ్య, వినోద్, నల్లప్ప, గోవర్ధన్‌రెడ్డి సుంకన్న, కిష్టన్న, బాబయ్య, గోవిందు పాల్గొన్నారు.

కోడుమూరు(రూరల్): మండలంలోని గోరంట్ల గ్రామంలోని లక్ష్మీమాధవస్వామి ఆలయంలో టీడీపీ సీనియర్ నేత విష్ణువర్ధన్‌రెడ్డి, కోడుమూరు టీడీపీ అభ్యర్థి బొగ్గుల దస్తగిరి, పరిశీలకుడు శ్రీనివాసమూర్తి పూజలు చేశారు. అనంతరం వారు గోరంట్ల గ్రామంలో వారు పర్యటించారు. వీరికి స్థానిక టీడీపీ నేతలు కున్నూరు మధుసూదన్‌నాయుడు, గిడ్డయ్య, మల్లయ్య, రాజు, గోపి, అయ్యన్న, చిన్నరాముడు, హోటల్ గిడ్డయ్య స్వాగతం పలికారు. ముందుగా స్థానిక చర్చిలో ప్రార్థనలు చేశారు. అనంతరం లక్ష్మీమా దవస్వామి ఆలయం చేరుకుని అక్కడ పూజలు చేశారు. కార్యక్రమంలో పార్లమెంట్ ఉపాధ్యక్షుడు మల్లిఖార్జునగౌడ్ మండల కన్వీనర్ కవితమ్మ, సర్పంచ్ బాలక్రిష్ణ, సద్దల శ్రీనివాసులు, సద్దల బాలరాజు పాల్గొన్నారు.

నొప్పుల మాత్రలతో జాగ్రత్త

సూపరింటెండెంట్ డాక్టర్ వి.వెంకటరంగారెడ్డి
వరల్డ్ కిడ్నీ డే సందర్భంగా నగరంలో ర్యాలీ

కర్నూలు(హాస్పిటల్), మార్చి 14: దేశంలో 7 శాతం మంది ప్రజలు నొప్పుల మాత్రలు వాడుతున్నారని, వీటి వల్ల కిడ్నీలు దెబ్బతినే ప్రమాదం ఉందని కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ వి.వెంకటరంగారెడ్డి హెచ్చరించారు. గురువారం కర్నూలు ప్రభుత్వ ఆసుప త్రిలో వరల్డ్ కిడ్నీ డేను పురస్కరించుకుని నెఫ్రాలజి, యురాలజి విభాగాల వైద్యులు అవగాహన ర్యాలీని ఆయన ప్రారంభించారు. ఈ ర్యాలీ కర్నూలు ప్రభుత్వాసుపత్రి నుంచి కలెక్టరేట్ మీదుగా రాజ్‌విహార్ సెంటరు వరకు తిరిగి కర్నూలు మెడికల్ కాలేజీ వరకు కొనసాగింది. కర్నూలు జీజీహెచ్, కిమ్స్ హాస్పిటల్, మెడికవర్ హాస్పిటల్ నెఫ్రాలజి వైద్యులు నర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం ఆసుపత్రి సూపరింటెండెంట్ మాటాడుతూ కిడ్నీ వ్యాధి ఉన్న వారు ప్రతి ఒక్కరూ ఆహార నియామవళి పాటించాలని సూచిం చారు. ఉప్పు బాగా తగ్గించాలని, షుగర్ వ్యాధి, బీపీలను తగ్గించుకోవాలన్నారు. కాళ్ల, ముఖం లో వాపు, బాగా తిమ్మిర్లు వచ్చిన, మూత్రంలో మంట వచ్చిన సీరం క్రియాటిన్ 1-5 ఎంజీ కన్నా ఎక్కువ ఉన్నా కిడ్నీ వైద్యున్ని సంప్రదించాలన్నారు. ప్రజల్లో ఈ జబ్బులపై అవగాహన కల్పించేందుకు మార్చి రెండో గురువారం వరల్డ్ కిడ్నీ డేని నిర్వహిస్తారని తెలిపారు. కార్యక్రమంలో నెఫ్రాలజి విభాగాధిపతి అనం త్, రిటైర్డు ప్రిన్సిపాల్ జిక్కి, యురాలజి హెచ్‌వోడీ వెంకట పక్కిరెడ్డి, శ్రీధర్‌శర్మ, కిమ్స్ మెడికవర్ నెఫ్రాలజి వైద్యులు అనంతరావు, మనోజ్ కుమార్, సిద్దార్థ, ఆర్ఎంవో వెంకటరమణ, నర్సింగ్ సూపరిం టెండెంట్ గ్రేడ్-1 వెంకట తులసమ్మ పాల్గొన్నారు.

ఉచిత కిడ్నీ స్కీనింగ్ క్యాంపు: అంతర్జాతీయ కిడ్నీ దినోత్సవం సందర్భంగా గురువారం కర్నూలు కిమ్స్‌కేర్ హాస్పిటల్‌లో ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఉచిత కిడ్నీ స్కినింగ్ పరీక్షలు నిర్వహించారు. ఈ క్యాంపులో సీబీపీ, ఆర్‌బీఎస్, సీరం క్రియోటిన్ నెఫ్రాలజి, ఫిజీషియన్ కన్సల్టేషన్ ఉచితంగా చేశారు. దాదాపు 500 మందికి క్యాంపు ద్వారా చికిత్స అందించారు. అనంతరం హాస్పిటల్‌లో కిడ్నీకి చికిత్స పొంది కోలుకున్న రోగులను సన్మానించారు. కార్యక్రమంలో హాస్పిటల్ సీఈవో ఎస్‌వీ చంద్రశేఖర్, నెఫ్రాల జిస్టు రవికుమార్, ఆర్థో సర్జన్ రవిబాబు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న నెఫ్రాలజి, యురాలజి వైద్యులు

ప్రభుత్వ కార్యాలయాల ఆవరణలో పశువులు



ప్రభుత్వ కార్యాలయాల ఆవరణలో తిరుగుతున్న పశువులు

గూడూరు, మార్చి 14: గూడూరు పట్టణంలోని ప్రభుత్వ కార్యాలయాల ఆవరణలో పశువుల బెడదతో ప్రజలు ఇక్కట్లకు గురవుతున్నారు. గూడూ రులోని తహసీల్దార్ భవనం శిథిలం కావడంతో కార్యాలయాన్ని పక్కనే ఉన్న మరో భవనంలోకి మార్చారు. పాత భవనం చోట కొత్త భవనం నిర్మించాల్సి ఉన్న ఇప్పటికీ కార్యరూపం దాల్చలేదు. ఈ ఆవరణలో తహసీల్దార్ కార్యాల యంతోపాటు మండల పరిషత్ కార్యాలయం, సబ్ రిజిస్ట్రర్, సబ్ ట్రెజరీ, వ్యవసాయ, హౌసింగ్ వంటి ప్రభుత్వ కార్యాలయాలు ఉన్నాయి. అయితే ప్రభుత్వ కార్యాలయాలకు ఎలాంటి రక్షణ గోడ లేకపోవడంతో ఆవరణలో పశువుల బెడద ఎక్కువైంది. దీంతో ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చే ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు.


17న పుస్తక పరిచయ సభ

కర్నూలు(కల్చరల్), మార్చి 14: సాహితీ స్రవంతి జిల్లా శాఖ ఆధ్వర్యంలో, ప్రముఖ కవి విల్సన్‌రావు కొమ్మవరపు రాసిన 'నాగలి కూడా ఆయుధమే' పుస్తక పరిచయ సభ ఈనెల 17న ఉదయం 10.30 గంటలకు ఏర్పాటు చేసినట్లు ఆ సంస్థ జిల్లా అధ్యక్షుడు ఆవుల బసప్ప, కార్యదర్శి ఆవుల చక్రపాణి యాదవ్ ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలోని సి.క్యాంపులోగల టీజీవీ కళాక్షేత్రంలో ఏర్పాటు చేసిన ఈ సభకు అధ్యక్షుడిగా సాహితీ స్రవంతి రాష్ట్ర కార్యదర్శి జంధ్యాల రఘుబాబు వ్యవహరిస్తారని, ముఖ్య అతిథిగా హైద రాబాదు సిటీ కాలేజీ తెలుగు శాఖాధిపతి డాక్టర్ కె.కోటేశ్వరరావు హాజ రవుతారని తెలిపారు. విశిష్ట అతిథిగా కేంద్ర సాహిత్య అకాడమీ యువ పుర స్కార గ్రహీత తగుళ్ల గోపాల్, సాహితీ స్రవంతి రాష్ట్ర అధ్యక్షుడు కెంగార మోహన్, కథా రచయితలు డాక్టర్ పేరం ఇందిరాదేవి, మారుతీ పౌరోహితం పుస్తక పరిచయం చేస్తారని తెలిపారు.

పనివేళలు పాటించని సిబ్బందిపై చర్యలు

సి.బెళగల్, మార్చి 14: పనివేళలు పాటించని సచివాలయ సిబ్బందిపై చర్యలు తప్పవని ఎంపీడీవో శకుంతల హెచ్చరించారు. గురు వారం మండలం లోని కొత్తకోట, ఈర్లదిన్నె సచివాలయాలను ఆమె తనిఖీ చేశారు. ఆమె మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది విధులకు సక్రమంగా రావ డం లేదని ప్రజలు ఎంపీడీవోకు పిర్యాదు చేశారన్నారు. ఈ మేరకు ఆయా గ్రామాల సచివాలయాలను తనిఖీ చేసి హాజరు, మూమెంట్ రికార్డులను పరిశీలించారు. విధులకు గైర్హాజరైన వారికి మెమెలు జారీ చేస్తున్నట్లు ఆమె తెలిపారు.

ఆదోని బీజేపీలో సీట్లాట



ఆదోని టౌన్, మార్చి 14: పొత్తుల్లో భాగంగా జిల్లాలో ఆదోని అసెంబ్లీ స్థానాన్ని బీజేపీకు కేటాయిస్తారన్న ఊహాగానాలను నిజం చేస్తూ సంకేతాలు వెలువడటంతో ఎట్టకేలకు అసెంబ్లీ ఎన్నికలలో పోటీచేసే అవకాశం బీజేపీకు దక్కింది. స్థానిక నాయకులలో సీటు కోసం పైరవీలు, ప్రయత్నాలు మొదలయ్యాయి. గతంలో 2009లో దేశాయి చంద్రన్న, తిరిగి 2019లో కునిగిరి నీలకంఠ (ప్రస్తుత బీజేపీ జిల్లా అధ్యక్షుడు) బీజేపీ తరపున అసెంబ్లీకు పోటీ చేశారు. ప్రస్తుతం మాజీ ఎమ్మెల్యే ఎన్ ప్రకాష్ జైన్‌తో పాటు, ప్రముఖ పారిశ్రామికవేత్త విట్టా రమేష్ పార్టీ టికెట్ కోసం తీవ్రంగా ప్రయత్నాలు కొనసాగిస్తున్నారు. ఇటీవల పార్టీలో చేరిన రమేష్ యాదవ్ కూడా ప్రయత్నాలు చేస్తుండగా, పోటీ మాత్రం విట్టా రమేష్, ప్రకాష్ జైన్ మధ్యనే కొనసాగుతోంది. ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తగా కెరీర్ ప్రారంభమైన విట్టా రమేష్, ప్రస్తుతం బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా ఉన్నారు. రాజకీయ నేపథ్యం ఉన్న కుటుంబం నుంచి వచ్చిన ఆయనకు మాజీ రాజ్యసభ సభ్యుడు టీజీ వెంకటేష్ ఆశీస్సులతో పాటు, ఆర్యవైశ్య సామాజిక వర్గీయులు బీజేపీ టికెట్ ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. 1983లో అసెంబ్లీ ఎన్నికలలో ఇండిపెండెంట్ అభ్యర్థిగా పోటీ చేసి 52.08 శాతం ఓట్లతో ఎమ్మెల్యేగా ఎంపికైన ప్రకాష్ జైన్, ప్రస్తుతం బీజేపీలో సీనియర్ నాయకుడిగా, బీజేపీ అన్యభాష రాష్ట్ర కన్వీనర్‌గా ఉన్నారు. జైన్ సామాజిక వర్గం నుంచి రాష్ట్రంలో ఎమ్మెల్యేగా ఎంపికైన ఏకైక వ్యక్తి కావడం విశేషం. ప్రకాష్ జైన్‌కు పోటీ చేయడానికి పార్టీ టికెట్ ఇవ్వాలని ఆల్ ఇండియా జైన్ సంఘం నుంచి బీజేపీ కేంద్ర పెద్దలకు ఒత్తిడి తెస్తున్నట్లు తెలిసింది. బీజేపీ టికెట్ ఎవరికి వస్తుందన్న ఉత్కంఠ సర్వత్రా నెలకొంది.

కార్యకర్తల కుటుంబాలకు అండగా ఉంటాం : జనసేన

ఆలూరు, మార్చి 14: ప్రమాదవశాత్తు మరణించిన జనసేన పార్టీ క్రియాశీలక సభ్యుల కుటుంబాలకు జనసేన అండగా ఉంటుందని ఆ పార్టీ ఆలూరు నియోజకవర్గ ఇన్‌చార్జి వెంకప్ప అన్నారు. బుధవారం రాత్రి మంగళగిరిలోని జనసేన పార్టీ రాష్ట్ర కార్యాలయంలో జనసేన పీఏసీ సభ్యుడు నాగబాబు చేతుల మీదుగా రూ.5 లక్షల చెక్కును మృతిచెందిన కార్యకర్త కుటుంబానికి అందజేశారు. ఈ సందర్భంగా వెంకప్ప మాట్లాడుతూ ఆస్పరి మండలం, చిరుమాన్ దొడ్డి గ్రామానికి చెందిన బాలమద్ది, హాలహర్వి మండలం కామినేహాల్ గ్రామానికి చెందిన విజయ్‌కుమార్ కుటుంబాలకు ఎళ్లవేళలా అండగా ఉంటామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆస్పరి, హాలహర్వి మండలాల అధ్యక్షులు అరవింద్ కుమార్, చంద్ర పాల్గొన్నారు.

పరీక్షల విధులలో మినహాయింపు ఇవ్వాలి : ఎస్టీయూ

ఆదోని (అగ్రికల్చర్), మార్చి 14: పదో తరగతి పబ్లిక్ పర్యవేక్షణ విధులు (ఇన్విజిలేషన్ డ్యూటీ) చంటి పిల్లలకు పాలిచ్చే మహిళా ఉపాధ్యాయులకు మినహాయింపు ఇవ్వాలని ఎస్టీయూ మండల అధ్యక్ష కార్యదర్శులు రామకృష్ణ, సుధాకర్ బాబు కోరారు. గురువారం ఎంఈవో శ్రీనివాసులు కలిసి వినతిపత్రం అందజేశారు ఎండ తీవ్రత వల్ల వారంతా ఇబ్బంది పడే అవకాశం ఉందని, మానవతా దృక్పథంతో ఆలోచించి నిర్ణయం తీసుకోవాలని కోరారు. నాయకులు సుంకన్న, గోపాల్, రామాంజనేయులు, సూర్యుడు, ప్రభన్న, మనోహర్, రామయ్య పాల్గొన్నారు.

'ఆదోని అసెంబ్లీ సీటు వైశ్యులకు కేటాయించాలి'

ఆదోని టౌన్, మార్చి 14: ఆదోని అసెంబ్లీ స్థానాన్ని పొత్తులో భాగంగా బీజేపీకి కేటాయించడం హర్షణీయమని, వైశ్యులకు చెందిన స్థానిక పారిశ్రామికవేత్త విట్టా రమేష్‌కు పోటీ చేసేందుకు అవకాశం కల్పించాలని ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడు మిరియాల బద్రీనాథ్, ఆవోపా అధ్యక్షుడు వీటీ ప్రకాష్ కోరారు. గురువారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ గతంలో రాచోటి రామయ్య మూడుసార్లు ఎమ్మెల్యేగాను, విట్టా కిష్టప్ప మూడుసార్లు మున్సిపల్ చైర్మన్ గాను, ఎంపికై నియోజకవర్గ ప్రజలకు సేవలందిచారని పేర్కొన్నారు. బీజేపీ అధిష్టానం ఈ విషయంలో ఆలోచించి నిర్ణయం తీసుకోవాలని కోరారు. ఆర్య వైశ్య మహిళా మండలి అధ్యక్షురాలు డాక్టర్ మిరియాల వినీత, జిల్లా కార్యదర్శి వినోద్‌కుమార్, ఉపాధ్యక్షుడు జీ నారాయణ, ఆవోపా కార్యదర్శి మిరియాల శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

ఏపీపీఎస్సీ అక్రమాలపై సీఎం రాజీనామా చేయాలి

హోసూరులో జగన్ దిష్టిబొమ్మ దహనం



హోసూరులో సీఎం దిష్టిబొమ్మ దహనం చేస్తున్న టీడీపీ నాయకులు

పత్తికొండ , మార్చి 13 : ఏపీపీఎస్‌సీలో అక్రమాలకు పాల్పడి నిరుద్యోగుల జీవితాలతో చెలగాటం ఆడుకున్న ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి రాజీనామా చేయాలని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కేఈ శ్యాంబాబు డిమాండ్‌చేశారు. గురువారం హోసూరులో టీడీపీ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. నిరసనకార్యక్రమం నిర్వహించి ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. గ్రూప్-1 మెయిన్స్‌లో జగన్మోహన్‌రెడ్డి అక్రమాలను హైకోర్టు బహిర్గతం చేసిందని సుమారు రూ 1.50కోట్ల అవినీతి బట్టబయలైందని పేర్కొన్నారు.

టీడీపీతోనే బలహీన వర్గాల అభివృద్ధి : కేఈ

పత్తికొండ: టీడీపీతోనే బడుగు బలహీనవర్గాల అభివృద్ధి సాధ్యమని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కేఈ శ్యాంబాబు అన్నారు. బాబుష్యూరిటీ-భవిష్యత్ గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా గురువారం జెంఎం తండా, హరాసూరు గ్రామాలలో ఆయన పర్యటించారు. ఆయనతోపాటు టీడీపీ ఎస్టీసెల్ జిల్లా అధ్యక్షుడు సోమ్లానాయక్, వాకిటి శ్రీను, గుడిసె నరసింహులు, జగ్గిలి అంజి, రాఘవేంద్ర, రామాంజి తదితరులు ఉన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

● నలుగురి అరెస్టు

చిప్పగిరి, మార్చి 14: కర్ణాటక నుంచి చిప్పగిరికి అక్రమంగా తరలిస్తున్న దాదాపు 3 లక్షల విలువచేసే కర్ణాటక మద్యాన్ని పోలీసులు గురువారం స్వాధీనం చేసుకున్నారు. కొండ ధనుంజయతో పాటు సతీష్, రవి, పవన్ కల్యాణ్ కర్ణాటక మద్యం ప్యాకెట్లను రెండు ద్విచక్ర వాహనాలపై తరలిస్తుండగా ఎస్సై మహమ్మద్ రిజ్వాన్ వారిని గుర్తించి పట్టుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు వివరించారు. కార్యక్రమంలో పోలీసులు యశ్వంత్, రామోజీ, భాస్కర్, షబీర్ అహ్మద్ పాల్గొన్నారు.

ఐదేళ్లలో రాష్ట్రంలో అభివృద్ధి శూన్యం : బీవీ

● ఎమ్మిగనూరు టీడీపీ అభ్యర్థి బీవీ జయనాగేశ్వరరెడ్డి విస్తృత ప్రచారం

● నందవరంలో సీఎం దిష్టిబొమ్మ దహనం



17వ వార్డులో ప్రచారం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే బీవీ

ఎమ్మిగనూరు, మార్చి 14: రాష్ట్రంలో ఐదేళ్ల వైసీపీ పాలనలో అభివృద్ధి శూన్యమని తెలుగు దేశం పార్టీ ఎమ్మిగనూరు అసెంబ్లీ అభ్యర్థి బీవీ జయనాగేశ్వరరెడ్డి అన్నారు. బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా గురువారం పట్టణంలోని 17వ వార్డు శక్తి నగర్‌లో పర్యటించారు. ఇంటింటికి తిరుగుతూ సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు సమస్యలతో సతమతమవుతుంటే వైసీపీ నాయకులు, ప్రజా ప్రతినిధులు కన్నెత్తి చూడటం లేదని విమర్శించారు. అపద్దపు హామీలను నమ్మి మరోసారి మోసపోవద్దని ప్రజలను కోరారు. వచ్చే ఎన్నికల్లో వైసీపీకి ఓటు అనే ఆయుధంతో తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వార్డు ఇన్‌చార్జీ జయన్న, కౌన్సిలర్లు దయాసాగర్, రామదాసు గౌడ్, నాయకులు కొండయ్య చౌదరి, రామకృష్ణ నాయుడు పాల్గొన్నారు.

సీఎం దిష్టిబొమ్మ దహనం

నందవరం : ఏపీపీఎస్సీ అక్రమాలపై సీఎం జగన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ స్థానిక బస్టాండ్ దగ్గర బీవీ ఆధ్వర్యంలో సీఎం జగన్ దిష్టి బొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా బీవీ మాట్లాడుతూ నిరుద్యోగుల జీవితాలతో ప్రభుత్వం చెలగాటం ఆడుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ పోస్టులను అమ్ముకొని అభ్యర్థులను మోసం చేశారని ఆరోపించారు. ప్రజలు అంతా గమనిస్తునే ఉన్నారని త్వరలో అడ్రస్ గల్లంతు చేస్తారని స్పష్టం చేశారు. కార్యక్రమం టీడీపీ జిల్లా ఉపాధ్యాక్షుడు దేశాయి మాదవరావు, రైస్‌మిల్ నారాయణరెడ్డి, మాచాపురం కాశీంవలీ, దర్మాపురం గోపాల్, గురురాజారావు పాల్గొన్నారు.

ఏపీపీఎస్సీని భ్రష్టు పట్టించిన ప్రభుత్వం : టీఎన్‌ఎస్‌ఎఫ్

ప్రభుత్వాన్ని ప్రశ్నించారంటూ టీఎన్‌ఎస్‌ఎఫ్ నేత అరెస్టు

ఆదోని, మార్చి 14: ఏపీపీఎస్సీని జగన్ వైసీపీఎస్సీగా మార్చేసి పూర్తిగా భ్రష్టు పట్టించారని టీఎన్‌ఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు అన్నారు. గురువారం రామాంజనేయులను వన్ టౌన్ పోలీసులు అక్రమంగా అరెస్టు చేశారు. ఈ సందర్భంగా రామాంజనేయులు మాట్లాడారు. టీడీపీ హయాంలో 169 గ్రూప్-1 ఉద్యోగాల భర్తీకి 2018లో నోటిఫికేషన్ ఇచ్చారని, అధికారంలోకి వచ్చిన వైసీపీ, గ్రూప్-1 మెయిన్స్ పరీక్షల నిర్వాహణ, మూల్యాంకనంలో అవకతవకలకు పాల్పడిందని విమర్శించారు. గ్రూప్-1 మూల్యాంకనంలో అవకతవకలను నిర్ధారిస్తూ మెయిన్స్‌ను రద్దు చేస్తూ హైకోర్టు తీర్పును స్వాగతిస్తున్నామన్నారు. ప్రతిపక్షనేతగా జగన్ 2.30 లక్షలకు పైగా ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేస్తానని, ప్రతియేటా జనవరి 1నే జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తానని హామీ ఇచ్చి విస్మరించారని వాపోయారు. చివరికి గ్రూప్-1 పేపర్ల వాల్యూవేషన్‌ని ఇష్టారాజ్యంగా నిర్వహించి నిరుద్యోగుల ఉసురు పోసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం ఇచ్చిన కోర్టు తీర్పు వైయస్సార్సీపీ ప్రభుత్వానికి చెంపపెట్టని అన్నారు. ప్రజాకాంక్షల మేరకు త్వరలో ప్రజాప్రభుత్వం ఏర్పడుతుందని, కోర్టు ఆదేశాల మేరకు పారదర్శంగా ప్రభుత్వ ఉద్యోగాలన్నీ భర్తీ చేస్తామని పేర్కొన్నారు.

త్రోబాల్‌లో బంగారు పతకం కైవసం

మంత్రాలయం, మార్చి 14: మంత్రాలయం మండలంలోని వగరూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న విద్యార్థి సువర్ణ రాష్ట్ర స్థాయి త్రోబాల్ క్రీడా పోటీల్లో విజయం సాధించి బంగారు పతకాన్ని కైవసం చేసుకుంది. గురువారం పాఠశాలలో సరస్వతి పూజ నిర్వహించి బంగారు మెడల్స్, ప్రశంసాపత్రాం, శాలువతో సన్మానించారు. వగరూరు పాఠశాలతో పాటు మంత్రాలయం మండలానికి ఎంతో గుర్తింపు తెచ్చిందని కొనియాడారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం నాగేంద్ర, ఉపాధ్యాయులు ఆనంద్, ప్రసాద్, నటరాజ్, ఈశ్వర్‌రెడ్డి, శైలజ, హేమ, అనురాధ, సీలప్పలు అభినందించారు.

నేటి నుంచి గంజహళ్లి బడేసాహెబ్ ఉరుసు

గోనెగండ్ల, మార్చి 14: గోనెగండ్ల మండల పరిధిలోని గంజహళ్లి గ్రామంలో వెలసిన మహత్మ బడేసాబ్ 330 ఉరుసు మహోత్సవం ఈనెల 15 నుంచి 17వ తేది వరకు జరుగుతున్నట్లు పీఠాధిపతులు మదార్‌సాహెబ్, ఉసేన్‌సాహెబ్, ఖాసీంసాహెబ్ తెలిపారు. మార్చి 15న శ్రీవారి గంధం, 16వ తేది శ్రీవారి ఉరుసు, 17వ తేది స్వామివారి జియారత్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉరుసు సందర్భంగా భక్తులకు బోజన సౌకర్యం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. స్వామివారు జీవసమాధి అయి ఇప్పటికి 330 ఎళ్లు అయిందని స్వామి వారి మహిమలు గురించి వివరించారు.

మినీ ట్యాంకును ఏర్పాటు చేయాలి



అధికార పార్టీ నాయకుడు తొలగించిన మినీ నీటి ట్యాంకు ఇదే

ఎమ్మిగనూరుటౌన్, మార్చి 14: వేసవిలో నీటి సమస్య తలెత్తకుండా మినీ ట్యాంకును ఏర్పాటు చేయాలని లక్ష్మీపేట వాసులు కోరుతున్నారు. గత టీడీపీ ప్రభుత్వం వార్డుల్లో మినీ నీటి ట్యాంకులతో పాటు నీటి బోర్లను ఏర్పాటు చేసింది. పట్టణ వ్యాప్తంగా దాదాపు 120 మినీ నీటి ట్యాంకులను 34 వార్డుల్లో అప్పట్లో ఏర్పాటు చేశారు. వీటి నిర్వహణను మున్సిపల్ అధికారులు పట్టించుకోకపోవడంతో అక్కడక్కడా కొన్ని పనిచేయడం లేదు. స్థానిక లక్ష్మీపేటలో అధికార వైసీపీ నాయకుడు తన ఇంటి ఎదుట రోడ్డుపై నీటి ట్యాంకును మున్సిపల్ అధికారుల అనుమతిలేకుండా తొలగించారు. దీంతో టీడీపీ వార్డు నాయకులు, స్థానిక ప్రజలు మున్సిపల్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. రెండు నెలలువుతున్నా ఎలాంటి చర్యలు తీసుకోకపోగా మినీ ట్యాంక్‌ను ఏర్పాటు చేయకపోవడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

గ్రామాల్లో తాగు నీటి కటకట

మంత్రాలయం, మార్చి 14: మండలంలోని కల్లుదేవకుంట, చిలకలడోన గ్రామాల్లో ప్రజలు తాగునీటికి అల్లాడుతున్నారు. నెల రోజులుగా తుంగభద్ర నది ఇంకిపోవడతో ఎస్‌ఏపీ స్కీం ద్వారా నీరు నిలిచిపోయి తీవ్ర నీటి ఎద్దడి ఏర్పడింది. తాగునీరు కోసం వ్యవసాయ బోర్లను ఆశ్రయించి దాహార్తిని తీర్చుకుంటున్నారు. తాగునీటి ఇబ్బందులు అధిగమించేందుకు అక్కడక్కడా ట్యాంకర్ల ద్వారా సరఫరా చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్రామాలకు శాశ్వతంగా తాగునీటి సమస్యకు పరిష్కారం చూపాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



కల్లుదేవకుంటలో ట్యాంకర్ దగ్గర నీటిని పట్టుకుంటున్న దృశ్యం

'కేంద్ర ప్రభుత్వంపై రైతులంతా గళమెత్తాలి'

ఆదోని (అగ్రికల్చర్), మార్చి 14: రైతుల పట్ల వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న కేంద్ర ప్రభుత్వాంపై దేశ్యాప్తంగా ఉన్న రైతులు గళం వినిపించాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకటేశులు, రైతు కూలీ సంఘం నాయకులు మల్లికార్జున, సీఐటీయూ కార్యదర్శి పీఎస్ గోపాల్, ఏఐటీయూసీ కార్యదర్శి వెంకన్న కోరారు. గురువారం మునిసిపల్ క్రీడా మైదానం నుంచి ఢిల్లీ మహానగరంలో జరిగే 540 రైతు సంఘాలతో కూడిన సంయుక్త కిసాన్ మోర్చా బహిరంగ సభను జయప్రదం చేయాలని ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో 70శాతానికి పైగా ఉన్న రైతులు, కౌలు రైతులు, వ్యవసాయ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం గొంతెత్తి నినాదించాలని సంయుక్త కిసాన్ మోర్చా పిలుపునిచ్చిందన్నారు. కేంద్ర ప్రభుత్వం పై తిరుగబాటుకు లక్షలాది మంది రైతులు భారీగా తరలిరావాలని పిలుపునిచ్చారు. నాయకులు నరసప్ప, ఈరన్న, మహానంద రెడ్డి, కల్లుబావి రాజు, మనెమ్మ, లింగన్న, తిప్పన్న, లక్ష్మణ్ణ, సుదర్శన్, అయ్యప్ప పాల్గొన్నారు.

రైతు రుణాలు మాఫీ చేయాలి

ఆలూరు: రైతులకు రుణాలు మాఫీ చేయాలని వామపక్ష రైతు సంఘాల నేతలు డిమాండ్ చేశారు. రైతుల దేశవ్యాప్త సమ్మె పిలుపులో భాగంగా ఢిల్లీలో రైతులు చేస్తున్న కార్యక్రమానికి మద్దతుగా రైతు, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో స్థానిక అంబేడ్కర్ సర్కిల్‌లో నిరసన తెలిపారు. సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి కేపీ నారాయణ స్వామి, సీపీఐ మండల కార్యదర్శి రామాంజినేయులు, సీపీఎం మండల కార్యదర్శి షాకీర్, రైతులు సంఘ మండల కార్యదర్శి ఈరన్న తదితరులు పాల్గొన్నారు.

ఆస్పరి : ఢిల్లీ రైతు ఉద్యమానికి మద్దతుగా స్థానిక బస్టాండ్‌లో రైతు సంఘాలు, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కే నాగేంద్ర, సీపీఎం మండల కార్యదర్శి హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

పెద్దకడుబూరు : రైతులను మోసం చేస్తున్న బీజేపీ ప్రభుత్వానికి ప్రజలు బుద్ధి చెబుతారని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు భాస్కర్ యాదవ్, సీపీఎం మండల కార్యదర్శి తిక్కన్న, రైతు సంఘం జిల్లా కార్యవర్గ సభ్యులు పరమేష్, సీపీఐ మండల కార్యదర్శి వీరేష్‌లు అన్నారు. మండల కేంద్రంలో రైతు సంఘం, ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. కేఎమ్‌యూ చంద్ర, తిక్కన్న, నాగరాజు, వీరేష్, శ్రీరాములు పాల్గొన్నారు.

పత్తికొండ టౌన్ : రైతాంగ సమస్యలను పరిష్కరించాలని రైతు సంఘం నియోజకవర్గ అధ్యక్షులు వీరన్న, ఏఐటీయూసీ నియోజకవర్గ అధ్యక్షలు రంగన్నలు డిమాండ్ చేశారు. ఢిల్లీలో రైతు ఆందోళనకు సంఘీభావంగా పత్తికొండలో ఏఐటీయూసీ, రైతు సంఘం ఆధ్వర్యంలో స్థానిక అంబేడ్కర్ సర్కిల్‌లో ధర్నా నిర్వహించారు.

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి

వెల్దుర్తి, మార్చి, 14: పట్టణంలో స్థానిక 6వ వార్డులో గురువారం టీడీపీ మండల అధ్యక్షులు బలరాం గౌడ్ ఆధ్వర్యంలో శంఖారావం కార్యక్రమం నిర్వహించారు. టీడీపీ ప్రకటించిన ఆరు గ్యారంటీ పథకాలను ఇంటింటికి తిరుగుతూ ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక్క అవకాశం అంటూ జగన్ మోహన్‌రెడ్డి రాష్ట్రాన్ని అప్పుల రాష్ట్రంగా మార్చారని విమర్శించారు. ఏ ఒక్క వర్గం కూడా ఈ ఐదేళ్లపాలనో సంతోషంగా లేరని, మళ్లీ రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలంటే టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడుతోనే సాధ్యమవుతుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో రమాకాంత్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, ఎర్రబజారు, రాజు, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జనసేన ఆవిర్భావ దినోత్సవం

పత్తికొండ టౌన్, మార్చి 14: పత్తికొండ పట్టణంలో గురువారం జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. 11వ జనసేన ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జనసేన పార్టీ కార్యాలయం ముందు ఆ పార్టీ జెండాను నియోజకవర్గ బాధ్యులు రాజశేఖర్ జెండాను ఎగురవేశారు. ప్రశ్నించడానికి జనసేన పార్టీ పుట్టిందని అన్నారు. రానున్న ఎన్నికల్లో టీడీపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థి కేఈ శ్యాంబాబు గెలుపునకు కృషి చేద్దామని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు వీరేష్, ఇస్మాయిల్, నాగరాజు, సుధాకర్, రాజు, అజయ్, తదితరులు పాల్గొన్నారు.

ఎంఈవో పై చర్యలు తీసుకోవాలి

పెద్దకడుబూరు, మార్చి 14: ఉచిత విద్యా హక్కు చట్టాన్ని నీరుగారుస్తున్న ఎంఈవోపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ మంత్రాలయం తాలూకా అధ్యక్షుడు ఎస్ వీరేష్ డిమాండ్ చేశారు. గురువారం ఏఐఎస్ఎఫ్, విద్యార్థుల తల్లిదండ్రుల అధ్వర్యంలో ఎమ్మార్వో ఆఫీస్ ఎదుట ధర్నా నిర్వహించారు. ప్రభుత్వం ఉచితవిద్యను అందించాలని జీవో జారీ చేస్తున్నా ఎంఈవో జీవోలకు విరుద్ధంగా ప్రైవేట్ పాఠశాలు రెయిన్‌బో, బాలవికాస్, శ్రీ వెంకటసాయి యూపీ పాఠశాలల యాజమాన్యాలు ద్వారా విద్యహక్కు చట్టాన్ని నీరుగారుస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు హజరత్ బాషా, రియన్ ఉసేన్ బాషా, సమీర్, రాము, ప్రవీణ్, విద్యార్థుల తల్లిదండ్రులు రాజు, ఆంజనేయ పాల్గొన్నారు.

రేపు పంచాయతీ వేలం పాటలు

మద్దికెర, మార్చి 14: మద్దికెర మేజర్ గ్రామ పంచాయతీకి సంబంధించిన సంత మార్కెట్, బస్టాండు, కబేలాల నిర్వహణకు ఈ నెల 16న ఉదయం గ్రామ పంచాయతీ కార్యాలయంలో వేలం పాటలు నిర్వహిస్తున్నట్లు పంచాయతీ కార్యదర్శి సంజప్ప, సర్పంచు బండారు సుహాసిని తెలిపారు. గురువారం విలేకరులతో మాట్లాడుతూ శనివారం సంత మార్కెట్, బస్టాండు, కబేలాలలో వ్యాపారాలు చేసుకునే వారి నుంచి సొంతంగా వసూలు చేసుకునేందుకు ఏడాది పాటు ఈ వేలం పాటలు నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు.

పంచాయతీ ఇన్‌చార్జి కార్యదర్శిగా సంజప్ప

మద్దికెర, మార్చి 14: గ్రామ పంచాయతీ ఇన్‌చార్జి కార్యదర్శిగా ఎం.అగ్రహారం గ్రామంలో పని చేస్తున్న కార్యదర్శి సంజప్పను ఇన్‌చార్జిగా నియమించారు. పంచాయతీ కార్యదర్శిగా ఉన్న ఈవోఆర్‌డీ మద్దిలేటి స్వామి సెలవు పెట్టడంతో ఆయన స్థానంలో సంజప్ప గురువారం బాధ్యతలు తీసుకున్నారు.

కార్ల్‌మార్క్స్ ప్రపంచ దిక్సూచి

దేవనకొండ ,మార్చి 14 : శ్రమ దోపిడీ, సమాజంలో అణచివేత దోరణికి వ్యతిరేకంగా పోరాడేవారికి మార్క్స్ సిద్ధాంతం దిక్సూచి అని సీపీఐ మండల కార్యదర్శి నర్సారావ్ అన్నారు. గురువారం స్థానిక సీపీఐ కార్యాలయంలో కారల్ మార్క్స్ 141వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఆయన నేటి సమాజానికి అవసరమైన సిద్ధాంతాలను ఆనాడే అందించిన మహనీయుడని ఆయన బాటలో పయనించాలని యువతకి పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వీరస్వామి ,భాస్కర్ ,రామాంజినేయులు ,కోదండ,తదితరులు పాల్గొన్నారు.

భక్తులతో పులకించిన మంత్రాలయం

మంత్రాలయం, మార్చి 14: రాఘవేంద్రస్వామి గురువైభోత్సవాల్లో నాల్గవ రోజు గురువారం వైభవంగా నిర్వహించారు. మఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు రాఘవేంద్రస్వామి బంగారు పాదుకలను తలపై పెట్టుకుని గురుభక్తిని చాటుకున్నారు. వివిధ రాష్ట్రాల నుంచి తరలివచ్చిన భక్తులతో మంత్రాలయం పులకరించింది. మూలబృందావనంకు సుప్రభాతం, నిర్మల విసర్జనం, క్షీరాభిషేకం, తులసీఅర్చన, విశేష పంచామృతాభిషేకం, అష్టోదకం చేశారు. మూలరాములకు కనకాభిషేకం చేసి భక్తులకు పీఠాధిపతి శేషవస్త్రం, ఫలపుష్ప మంత్రాక్షితలు, పరిమళ ప్రసాదం ఇచ్చి ఆశీర్వదించారు. ప్రహ్లాదరాయలను చెక్క, వెండి, బంగారు రథాలపై ఊరేగించి ఊంజల సేవ చేశారు. ఉత్సవాల్లో భాగంగా రాత్రి యోగీంద్ర కళామండపంలో బెంగుళూరు చెందిన క్రిష్ణ, తేజశ్విని, కొండూరిచే నిర్వహించిన భరతనాట్యం భక్తులను అలరించింది.

అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించిన ఎమ్మెల్యే

వెల్దుర్తి, మార్చి, 14 : అల్లుగుండు గ్రామంలో గురువారం వైసీపీ నాయకుడు శ్రీరామ్‌రెడ్డి ఆధ్వర్యంలో రూ.40 లక్షలతో నిర్మించిన నీళ్ల ట్యాంకు, రూ.10 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లను ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి ప్రారంభించారు. అనంతరం మహిళలకు ఇంటి రిజిస్ట్రేషన్ పట్టాలు అందజేశారు. సర్పంచి లక్ష్మీదేవి స్వగృహంలో అల్పాహారం సేవించారు. అంతకుముందు పూలమాలలతో, బాణసంచాలతో ఎమ్మెల్యేను ఊరేగింపుగా తీసుకెళ్లారు. అదేవిధంగా బింగిదొడ్డి గ్రామంలో హెల్త్‌క్లినిక్, ఆర్‌బీకే, సచివాలయాలను సర్పంచి వెంకటేశ్వరమ్మలతో కలసి ప్రారం భించారు. వెల్దుర్తిలో మండల కన్వీనర్ రవిరెడ్డి ఆధ్వర్యంలో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు. తహసీల్దార్ అనంత ఆచారి, ఎంపీడీఓ శివశంకరప్ప, జడ్పీటీసీ సుంకన్న తదితరులు పాల్గొన్నారు.

'రాఘవేంద్రరెడ్డికి సహకరించేది లేదు'



మంత్రాలయంలో నిరసన ప్రదర్శన నిర్వహిస్తున్న తిక్కారెడ్డి వర్గీయులు

కౌతాళం, మార్చి 14: తెలుగుదేశం పార్టీ అధిష్టానం గురువారం ప్రకటించిన అసెంబ్లీ స్థానాల రెండో జాబితాలో మంత్రాలయం నియోజకవర్గ అభ్యర్థిగా ప్రకటించిన మాధవరం రాఘవేంద్ర రెడ్డికి కౌతాళం మండల టీడీపీ నాయకులు, కార్యకర్తలు సహకరించేది లేదని మండల టీడీపీ నాయకులు ముక్తకంఠంతో నిరసన తెలిపారు. కౌతాళంలో జిల్లా టీడీపీ ఉపాధ్యక్షుడు చెన్నబసప్ప నివాసం వద్ద పార్టీ నాయకులు, కార్యకర్తల సమావేశం నిర్వహించారు. టీడీపీ రైతు విభాగ రాష్ట్ర, జిల్లా కార్యదర్శులు అడివప్పగౌడ్, వెంకటపతిరాజు, క్లస్టర్-2 ఇన్‌చార్జి కోట్రేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కోసిగి : మంత్రాలయం సీటుకు తిక్కారెడ్డిని ప్రకటించకపోవడంపై ఆయన వర్గీయులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కోసిగిలోని వాల్మీకి సర్కిల్‌లో టీడీపీ నాయకులు వక్రాణి వెంకటేశ్, పెండ్యాల భరద్వాజశెట్టి, వీరారెడ్డి, ఈరయ్య, నాడిగేని కోసిగయ్య, ఖలందర్, నర్సారెడ్డి, నరసింహులు నిరసన వ్యక్తంచేశారు. కొందరు కార్యకర్తలు, పెట్రోల్, డీజిల్ ఒంటిపై పోసుకుని ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించారు. అనంతరం టైర్లకు నిప్పు పెట్టి రోడ్డుపై బైఠాయించి తిక్కారెడ్డికి సీటు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

మంత్రాలయంలో నిరసన ప్రదర్శన

మంత్రాలయం : మంత్రాలయం టీడీపీ టికెట్ ఇన్‌చార్జి పాలకుర్తి తిక్కారెడ్డికే ఇవ్వాలని, లేకపోతే టీడీపీకి మంత్రాలయం నియోజకవర్గం నుంచి మూకుమ్మడిగా రాజీనామాలు చేస్తామని మండల కన్వీనర్ పన్నగ వెంకటేశ్, బూదూరు మల్లికార్జున రెడ్డి, సత్యనారాయణరెడ్డి, క్లస్టర్ ఇన్‌చార్జి ఎల్లారెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి చావిడి వెంకటేశ్, నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షులు అమర్నాథ్ రెడ్డి డిమాండ్ చేశారు. టీడీపీ అధిష్టానం ప్రకటించిన రెండో జాబితాలో తిక్కారెడ్డి పేరు కాకుండా ఎమ్మెల్యే బాలనాగిరెడ్డికి కోవర్టుగా ఉండి మూడు నెలల కింద పార్టీలో చేరిన రాఘవేంద్రరెడ్డికి ఎలా టికెట్ ఇస్తారని ప్రశ్నించారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

దేవనకొండ ,మార్చి 14 : స్థానిక జెడ్పీపాఠశాల ఆవరణలో 261, 258 పోలింగ్ కేంద్రాలను తహసీల్దార్ ఈశ్వరయ్య శెట్టి పరిశీలించారు. మండలంలోని 62 పోలింగ్ కేంద్రాలలో ఎన్నికల నేపథ్యంలో ఓటర్లు ఇబ్బందులు పడకుండా పోలింగ్ కేంద్రాలలో వసతుల కల్పిస్తామన్నారు. బీఎల్వోలు ప్రజలకు అందుబాటులో ఉంటూ ఓటుపై అపోహలను తొలగించాలన్నారు. వీఆర్వో దాదావలి ఉన్నారు.

వైద్యశాల భవనాలకు భూమి పూజ

దేవనకొండ ,మార్చి 14: మండలంలోని తెర్నేకల్ లో ప్రాథామిక వైద్య కేంద్రం నూతన భవనాలకు గురువారం భూమి పూజ చేశారు. రూ.1.5 కోట్లతో వైద్యశాలకు నూతన భవన నిర్మాణాలు చేపట్టనున్నట్లు గ్రామ సర్పంచు ఆరుణ్‌కుమార్ తెలిపారు. కులమతాలకు అతీతంగా భూమిపూజ కార్యక్రమానికి అన్ని మతస్తులు ప్రార్థనలు చేశారు.

చలివేంద్రం ప్రారంభం

మంత్రాలయం, మార్చి 14: మంత్రాలయం మండలంలోని వగరూరు గ్రామంలో వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని తండ్రి సయ్యద్ షాకీర్ బాషాఖాద్రి జ్ఞాపకార్థంగా పాషా ఖాద్రి చలివేంద్రాన్ని ప్రారంభించారు. గురువారం సచివాలయం సమీపంలో గ్రామ ప్రజల దాహార్తిని తీర్చేందుకు వేసవి కాలమంతా కొనసాగిస్తామని, గతంలో రూ.1.05లక్షలతో బోరు వేసి నీటి ట్యాంకును ఏర్పాటు చేశామని పేర్కొన్నారు.